ఎన్నికల ప్రత్యేక సంచిక

Visit Internet Edition @ www.jaminryot.com

స్థాపకులు నెల్లూరు వెంకట్రామానాయుడు          సంపాదకులు నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి 75   సంచిక 17   19.4.2004   సోమవారం   24పేజీలు   విడిప్రతి రూ.3.00

డి.ఆర్. ఉత్తమలో విందుల పసందు

D.R. UTTHAMA ★★★ HOTEL

ప్రతి రోజూ వివిధ రకాల వెజ్ & నాన్‌వెజ్ స్పెషల్ బఫే లంచ్ రూ.160లకే

Ph: 2317777 - 10 Lines

# సైకిల్ గతి తప్పినట్లేనా?

రాష్ట్రంలో రోజు రోజుకూ తన ప్రకాశం మసకబారుతున్న విషయం చంద్రబాబుకు అర్థమౌతున్నది. జీర్ణించుకోలేని నిజం అది. కాని తప్పదు. ఎన్నికలలో సుదీర్ఘ అనుభవం గల నాయకుడాయన. గెలుపు ఓటములకు సూచనలు ఏమిటో ఒకరు ప్రత్యేకంగా వివరించి చెప్పనవసరం లేదు. పైపెచ్చు ఆయనకు సమాచార మార్గాలు లెక్కలేనన్ని వున్నాయి. ఇంటెలిజెన్స్ విభాగం పోలీసుల నుంచి, పత్రికా యాజమాన్యాలు, ప్రయివేటు సర్వే సంస్థలు, పార్టీ అంతర్గత అంచనా బృందాలు, సీనియర్ విలేకరులు వంటి మార్గాల ద్వారా ఎప్పటి కప్పుడు సమాచారం తెప్పించుకోవడం; వాటిని విశ్లేషించుకోవడం చంద్రబాబుకు అలవాటు. ఆ వర్గాలన్నీ జరగనున్న ప్రమాదాన్ని సూచనమాత్రంగా వెల్లడించడం ఒక ప్రక్క; రకరకాల సర్వేల ఫలితాలు మరొక ప్రక్క ఆయన్ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఏదో జరిగి పోతున్నది; తన చెయ్యి దాటి పోతుందన్న భయం మాత్రం ఆయనలో స్పష్టంగా కనిపిస్తున్నది. తన సభలకు వస్తున్న జనసంఖ్య పల్చబడడం, తన అభ్యర్థులు ప్రచారంలో ఎదుర్కొంటున్న నిరసనల హోరు అర్థం చేసుకోలేని అమాయకుడేమీ కాదు చంద్రబాబు. అయితే ఓటమి సూచన కనపడగానే పరా జయాన్ని అంగీకరించి నిష్క్రమించే భీరువు మాత్రం కాదు. చివరి కంటా పోరాడడం ఆయన తత్వం. సమస్యలు తనను చుట్టుముట్టినప్పుడు, ఎటూ దిక్కుతోచని స్థితి ఏర్పడినప్పుడు ఆయన రాజకీయ చాణక్యం బాగా పని చేస్తుంది. గత ఎన్నికలలో ఆయన తీరు గమనించిన వారెవరికైనా అది అర్థమౌతుంది. తన అమ్ముల పొదిలోని చివరి అస్త్రం చేతిలో వున్నంత వరకు ఎన్నికల రణక్షేత్రంలో వీరోచిత పోరాటం చేయడానికి ఎంత మాత్రం సందేహించడాయన.

తరువాయి 23వపేజీలో



మునిసిపల్ కౌన్సిలర్ భానుశ్రీ, ఆనం వివేకానంద రెడ్డిల ప్రచారం



రంభ గ్లామర్‌తో బిజెపి సురేష్‌రెడ్డి ఓట్ల గాలం

# వాజ్‌పాయి గద్దె దిగినా...

# సోనియా ఎక్కడం కష్టం!

కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందా? వాజ్‌పాయి మళ్లీ అధికార పీఠం ఎక్కుతాడా? బిజెపి, దాని మిత్ర పక్షాలు ప్రచారం



చేస్తున్న భారత్ వెలిగి పోతుందన్న ప్రచారాన్ని భారతీయ ఓటరు ఆమోదిస్తున్నాడా లేక తిరస్కరిస్తున్నాడా? ఎన్డీఏ అధికారంలోకి రాలేక పోతే - ప్రధాన మంత్రి ఎవరు అవుతారు? ఏ కొత్త కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుంది? దానిలో కాంగ్రెస్ పాత్ర ఏమిటి? బిజెపి ఎత్తుగడలు ఎట్లా వుంటాయి?

రాజకీయ పరిశీలకులను వేధిస్తున్న ప్రశ్నలివి. మొదటి దశ ఎన్నికల ప్రక్రియ ముగిసి పోతున్నప్పటికీ, దేశ రాజకీయ వాతావరణాన్ని అంచనా వేయడంలో ఈసారి తలలు పండిన రాజకీయ పండితులు కూడా విఫలమౌతున్నారు. జాతీయ పార్టీల సంఖ్య అంతరించి ఎక్కడికక్కడ, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు, వ్యక్తి పార్టీలు పుట్టుకుని రావడం వల్ల ఏర్పడిన అయోమయ పరిస్థితి ఇది. 1999 ఎన్నికలలో 7 జాతీయ పార్టీలు; 40 గుర్తింపు కల్గిన ప్రాంతీయ పార్టీలు; 121 గుర్తింపు లేని రిజిష్టర్డు పార్టీలు పోటీ చేశాయి. వీటిలో మొత్తం 48 పార్టీలు లోక్‌సభలో ప్రవేశించాయి. 13 పార్టీలకు ఒకే ఒక సభ్యుడు, ఐదు పార్టీలకు ఇద్దరేసి సభ్యులు వున్నారు గత లోక్‌సభలో. అందువల్లనే ఎన్‌డిఏ కూటమి 28 పార్టీల సమాహారణంగా ఏర్పడింది. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలలో కూడా ఈ పార్టీలన్నీ పోటీ చేస్తున్నాయి. ఈ అయోమయ పరిస్థితుల్లో ఎన్నికల అంచనాలు ఎట్లా సాధ్యం చెప్పండి. ఈ కలగూర గంప సమీకరణాల వల్ల జాతీయ పార్టీలు కుంచించుకపోతున్నాయి. ఈ ఎన్నికలలో 300 స్థానాలు సాధించడం తమ లక్ష్యం అని పదే పదే ప్రకటిస్తున్నాడు వెంకయ్యనాయుడు. కాని వారి పార్టీ ఈసారి మొత్తం 300 స్థానాలలో పోటీ కూడా చేయడం లేదు. ఇక 300 స్థానాలు గెలిచేది ఏమిటి? కాంగ్రెస్ పరిస్థితి కొంత వరకు నయం. ఉత్తర ప్రదేశ్‌లో ఎన్నికల పొత్తు కుదరడం వల్ల, అందరి కంటే అత్యధికంగా దాదాపు 400 స్థానాలలో తన అభ్యర్థులను పోటీకి దింపింది. కాని వీటిలో ఇంచుమించు వంద స్థానాలను కేవలం పోటీ కోసం పోటీకి పెట్టినవే.

గత లోక్‌సభలో బిజెపికి 182, కాంగ్రెస్‌కు 112 స్థానాలు వచ్చాయి. ఇవి రెండు చరిత్ర సృష్టించిన సంఖ్యలు. కాంగ్రెస్ ఇంత తక్కువ స్థానాలతో ఎప్పుడూ అవమానింపబడలేదు; బిజెపి ఇంత అత్యధిక సీట్లతో ఎప్పుడూ గౌరవింపబడనూ లేదు.

బిజెపి కాని, దాని మిత్రులైన ఎన్‌డిఏ భాగస్వాములు కాని ఈసారి మళ్లీ తమకు అధికారం వస్తుందన్న అంచనాతోనే వ్యవహరిస్తున్నారు. ప్రధాని వాజ్‌పాయి అప్పుడే తన వారసుడి




గురించి కూడా మాట్లాడుతున్నాడు. తాము చేపట్టిన భారత్ వెలిగి పోతుందన్న ప్రచారం జనంలోకి చొచ్చుకు పోవడం; కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలో కూడా చెప్పుకోదగిన రీతిలో ప్రాంతీయ శక్తులతో పొత్తు కుదుర్చుకోలేక పోవడం; వనరుల రీత్యా తమతో తమ ప్రత్యర్థులు పోటీ పడే పరిస్థితి లేక పోవడం; ఎన్‌డిఏ భాగస్వాములందరూ అరమరికలు లేకుండా కలయిక కొనసాగించడం; ఇటీవలే జరిగిన నాలుగు ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికలలో తమ పార్టీని ఓటర్లు గద్దె ఎక్కించడం వంటి అంశాలు వారి ఆత్మవిశ్వాసానికి కారణం. సోనియాగాంధీ విదేశీయత ప్రజలలో ఇంకా చర్చలో వుండడం కాంగ్రెస్‌కు పెద్ద అననుకూలత. శరద్‌పవార్ వంటి ప్రాంతీయ శక్తులు, వామ పక్షాలు దాన్ని ప్రక్కన పెట్టి కాంగ్రెస్‌తో చేతులు కలిపినప్పటికి రేపు అధికారంలోకి వస్తే తమ కూటమి తరఫున ప్రధాన మంత్రిత్వం స్వీకరించే వారెవ్వరో తేల్చి చెప్పలేక పోతున్నది కాంగ్రెస్ పార్టీ. సోనియా గాంధీ కూడా తనే రేపటి అధికార కూటమికి అధినేత్రిని అని చెప్పే పరిస్థితిలో లేరు. ఆమె కూడా ఆ విషయాన్ని ప్రశ్నార్థకంలోనే పెట్టి ఎన్ని

తరువాయి 23వపేజీలో

# మాదాల విజయం - నవశకానికి స్వాగతం





కావలి ప్రగతికి వాకిళ్లు తెరుద్దాం

రైతు సమస్యలకు పరిష్కారం వెదుకుదాం

తెలుగుదేశం పార్టీకి ఓటేద్దాం

మాదాల జానకిరాంను స్వాగతిద్దాం

నవశకానికి నాంది పలుకుదాం

రండి - కలిసిరండి

మాదాలకు అండగా నిలవండి

మన ఎన్నికల గుర్తు

పోలింగ్ తేది: 26-4-2004

**కావలి నియోజక వర్గ**

**తెలుగుదేశం కార్యకర్తలు**

Space Donated by : Nellore Dist. TDP, Nellore.

# ఇద్దరిదీ చావు బ్రతుకుల పోరు; గట్టెక్కేదెవరు?

**నెల్లూరు ఎన్నిక తీరు!**

నెల్లూరు పూర్తిగా పట్టణ ప్రాంతం; జిల్లా కేంద్రం కావడంతో ప్రాధాన్యత జాస్తి; నెల్లూరు ఎమ్మెల్యే అంటే మంత్రితో సమానంగా గుర్తింపు వస్తుంది. ఒకప్పుడు బిజెపికి నెల్లూరులో మంచి పలుకుబడి వుండేది. ముప్పై అయిదేళ్ల క్రితం అన్నదాత మాధవరావు ఆనాటి 'ఆనం' ప్రాభవాన్ని తోసిరాజని ఎమ్మెల్యేగా గెలిచాడు. కాని ఆ తర్వాత ఎప్పుడూ వారికి ఆ అవకాశం రాలేదు. ఏటికేడాది వారి ప్రభ మసకబారడం తప్ప, మెరుగైంది లేదు. గత ఎన్నికల్లో ఆమంచర్ల శంకరనారాయణను పోటీకి నిల్పితే కేవలం అయిదు వేల ఓట్లే వచ్చాయి. వుండీ లేనట్లున్న పార్టీకి పూర్వ ఔన్నత్యం తేవాలన్నది బిజెపి అభ్యర్థి సురేష్‌రెడ్డి తపన. అందుకోసం ఇటు తన స్వంత పార్టీలో, అటు మిత్ర పక్షమైన తెలుగుదేశంతో పోరాటం చేసి మరీ టిక్కెట్ తెచ్చుకున్నాడు. అవకాశాలు కూడా ఆశావహంగానే వున్నాయి. గత ఎన్నికల ఓటింగ్ చూస్తే బిజెపికే అనుకూలంగా వున్నట్లు కనపడే నియోజకవర్గం ఇది. ఆ తర్వాత కేంద్రమంత్రిగా, పార్టీ జాతీయ అధ్యక్షుడిగా వెంకయ్య నాయుడు నెల్లూరుటౌన్‌కు, జిల్లాకు చేసిన సేవ అంతా ఇంతా కాదు. ఆయన పేరు ప్రతిష్టలు పార్టీలకు అతీతంగా అమాంతం ఆకాశానికి ఎగశాయి. అది ఓటరు మీద ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదు. తెలుగుదేశం నుంచి ఎప్పుడూ లేనిది, సంపూర్ణ మద్దతు లభిస్తున్నది. డబ్బు, దస్కానికి లోటు లేదు. వెంకయ్య నాయుడు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. ఇన్ని అనుకూలతలు ఒకేసారి కలిసి రావడం అరుదైన విషయం. వీటిని వాడుకుని ఇప్పుడు గెలవకుంటే ఇక ఎప్పటికీ గెల్చే అవకాశం రాదు. ఆ సంగతి సురేష్‌రెడ్డికి తెలుసు. దాన్ని అందిపుచ్చుకుని అసెంబ్లీకి వెళ్లడమా? లేక ఎక్కవలసిన రైలు ఒక జీవిత కాలం లేటు అని చింతిస్తూ రాజకీయంగా తెరమరుగై పోవడమా తేల్చుకోవలసిన తరుణమిది - ఆయనకు.

ఆనం వివేకానందరెడ్డికి రాజకీయం ఆరోప్రాణం; అదే వ్యాపకం; అదే జీవితం. ఏ ఎన్నిక అయినా ఆయనకు కీలకమే; బ్రతుకు పోరాటమే. నెల్లూరునే నమ్ముకున్న వ్యక్తి. మునిసిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ఇక్కడ నుంచే గెల్చిన వ్యక్తి. ఈసారి కూడా గెలిస్తే జిల్లా కాంగ్రెస్ రాజకీయాలలో స్థిర స్థానం లభిస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి రానున్న సమయం కాబట్టి - ఒకవేళ ఓటమి ఎదురైతే తెరమరుగై పోయే ప్రమాదం వుంది. కాబట్టి గెల్చి తీరాలి.



బాలాయపల్లిలో ప్రచారం చేస్తున్న వెంకటగిరి కాంగ్రెస్ అభ్యర్థి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ

దానితో ఇద్దరూ చెమటోడ్చి పని చేస్తున్నారు. నెల్లూరులో జరిగినంత ప్రచారం జిల్లాలో మరే నియోజకవర్గంలో జరగడం లేదు. తతిమా అన్ని చోట్లా వూర్లో ప్రదర్శనలే ప్రచారం. ఇక్కడ మాత్రం ఇంటింటి పలకరింపు. సురేష్‌రెడ్డికి గ్రహాలు బాగా కలిసి వస్తున్నాయి. రమేష్‌రెడ్డి, అనూరాధ దంపతులు తమ కోసం అంత శ్రద్ధగా తిరగడం బిజెపి కార్యకర్తలకే ఆశ్చర్యంగా వుంది. రమేష్‌రెడ్డి పెత్తనంతో చిరాకు కల్గుతున్నప్పటికీ - వైటినాయుడు, శ్రీధర కృష్ణారెడ్డి లిరువురూ కూడా మనసు పెట్టి పని చేస్తున్నారు. గత ఎన్నికలో తెలుగుదేశం నుంచి ఇంత సహకారం తీసుకోవడం డేగా నరసింహారెడ్డికి అలివి కాలేదు. సురేష్‌రెడ్డి మాత్రం అందులో కృతకృత్యుడైనాడు.

టౌన్‌లో మైనారిటీ ఓటు బ్యాంకు పెద్దది కాబట్టి, దాని మీద ప్రత్యేక దృష్టి పెట్టింది బిజెపి. ఎప్పుడూ లేనిది జెండావీధిలో కూడా కాషాయ జెండా ఎగుర వేశారు. కాంగ్రెస్ అసంతృప్తవాది సందాని బాషా ముస్లిం అన్నవాడు కనిపిస్తే వదలకుండా పట్టుకుని వివేకానందరెడ్డిని ఓడించవలసిన అవసరాన్ని నొక్కి చెప్తున్నాడు; బ్రెయిన్‌వాష్ చేస్తున్నాడు. కాని ముస్లింల సమస్య జాతీయ స్థాయిలో భద్రతకు సంబంధించినది; స్థానికంగా సందాని సమస్యకు వారు ఆ విధానం మార్చుకుంటారా అన్నది అనుమానం. కాని సందాని మీద పెద్ద ఆశలే పెట్టుకుని వున్నారు బిజెపి నేతలు. కెవిఆర్ చంద్రయ్య చేత కూడా ఒక రోడ్‌షో ఇప్పించారు వారు. చంద్రయ్య తెరమరుగై పోయిన కాంగ్రెస్‌వాది. వీరి పుణ్యాన వీధి ముఖం చూచాడు. రాజేశ్వరి దేవస్థానం మాజీ ఛైర్మన్ కె.వి.రాఘవరెడ్డి, వివేకా మీద అలిగి నేరుగా కాషాయ కండువా ధరించేశాడు. తన అబ్బది పోయినట్లు చేస్తున్నాడు. బిజెపి అసంతృప్తి వాదులందరి నోళ్లూ మూయించి వేశాడు వెంకయ్య నాయుడు. ఆర్‌ఎస్‌ఎస్ సేవకులంతా నిశ్శబ్దంగా దిగి పోయి వున్నారు. పెదలు

తరువాయి 14వపేజీలో




# బొల్లినేనికి ఓటేద్దాం - ప్రగతికి చోటిద్దాం!

త్యాగశీలి, సౌమ్యుడు, దయార్ద్ర హృదయుడు,

మంచికి మరోపేరు మనలో ఒకడు,

ఆత్మకూరు నియోజకవర్గ శాంతిభద్రతల పరిరక్షకుడు

తెలుగుదేశం బలపరుస్తున్న ఆత్మకూరు బిజెపి అభ్యర్థి

**బొల్లినేని కృష్ణయ్య నాయుడు**కు

ఓటేసి గెలిపిద్దాం - నియోజకవర్గాన్ని ప్రగతి బాటలో పయనింపజేద్దాం.

**వ్యక్తిగత కక్షలు, కుట్రలు, కుతంత్రాలు మీ గెలుపుకు ఎప్పుడు అడ్డురావు**

**కమలం గుర్తుకే మీ ఓటు**

పోలింగ్ తేది: 26-04-2004



చల్లా షేద్దబుజ్జిరెడ్డి
నూకనపల్లి



సిహెచ్. ప్రకాశరావు
తెలుగురాయపురం

# గాలి వాలును బట్టే గెలుపు!



కొరుటూరు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఆదాల ప్రభాకరరెడ్డి, తెదె.

జిల్లాలోనే కాదు, హైదరాబాదు రాజకీయ వర్గాలలో కూడా సర్వేపల్లి ఫలితం అంచనాపై అమిత ఆసక్తి కనపడుతున్నది. ఇక్కడ పోటీ చేస్తున్న ఇద్దరు అభ్యర్థులూ రాష్ట్ర స్థాయిలో వివాదాస్పదులు కావడమే అందుకు కారణం. చంద్రబాబు దివాణంలో పూడిగం పడులుకుని వచ్చిన వారిలో ప్రథముడు - ఆదాల ప్రభాకర రెడ్డి. తెలుగుదేశం పార్టీని ధిక్కరించినా ఏమీ జరగదని తేల్చి చెప్పిన వాడాయన. సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి సంగతి తెలిసిందే. వైఎస్ రాజశేఖరరెడ్డి వంటి సీనియర్

## సర్వేపల్లిలో కొత్తొక వింత, పాత - రోత అవుతుందా?

కాంగ్రెస్ నేతలను తిట్టాలనుకున్నప్పుడల్లా చంద్రమోహన రెడ్డిని ఉసిగొల్పేవాడు చంద్రబాబు. అందుకే ప్రతిపక్షం వారికంతా ఆయనంటే గుర్రు. తనను ధిక్కరించి వెళ్లిన ప్రభాకరరెడ్డి మళ్లీ అసెంబ్లీలో అడుగు పెట్టడానికి లేదని చంద్రబాబు ఆదేశం; చీటికి మాటికి చిడ పెట్టే చంద్రమోహనరెడ్డి ఓడిపోతేనే తగిన శాస్తి అని ప్రతిపక్షం ఆశ. అందుకే ఈ నియోజక వర్గంపై అందరి కళ్లు పడుతున్నాయి.

వీరిద్దరి ప్రచారం కూడా వుడుకు, మిడుకుగా వుంది. పార్టీలు, హామీలు, సిద్ధాంతాలు, వుపన్యాసాలు వదలిపెట్టి నేరుగా, పేర్లు పెట్టి బూతులు వల్లించుకోవడమే వీరి ప్రచార సారాంశం. ఇంచుమించు ప్రతి రోజూ ఇదే జరుగుతున్నది. ఆ తిట్లు వినలేక చెవులు మూసుకుంటున్నారు సర్వేపల్లి ఓటర్లు. మైక్ పట్టుకుంటే చాలు పూనకం వచ్చేస్తున్నది వీరికి. ఇంతగా వ్యక్తి నిందా ప్రచారం మరే నియోజక వర్గంలోనూ జరగడం లేదు. రోజుకొక కొత్త అంశం కనిపెట్టి మరీ తిట్టుకుంటున్నారు. ఇద్దరిలోనూ అసహనం పెరిగి పోతున్నది; సంస్కార ఎల్లలు దాటుతున్నారు.

గత వారం వెలిబుచ్చాము - ఇద్దరిలో ఎవరు కోటీశ్వరులో అర్థం కావడం లేదని. ఈ వారానికి కూడా అదే పరిస్థితి. తన మీద కోటీశ్వరుల దాడి జరుగుతున్నదని ఇల్లెక్కి గోల చేసిన చంద్రమోహనరెడ్డి ఎన్నికల వ్యయాన్ని అత్యంత వుదారంగా జార విడుస్తున్నాడు. ఏ గ్రామంలో కూడా తెలుగుదేశం కార్యకర్తలకు డబ్బు కొరత అన్నది లేదు. వెయ్యి రూపాయల నోట్లు గాలిపటాల వలె ఎగురుతున్నాయి. పోలింగుకు పది రోజుల ముందుగానే గిరిజన కాలనీలన్నింటిలో మహిళలకు చీరల పంపకం జరిగి పోయింది. వాహనాలు; ప్రచారంలో పాల్గొనే వారికి మందు, విందులు; కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, జెండాలు వంటివన్నీ ఒక పథకం ప్రకారం ఏర్పాటై పోతున్నాయి. డబ్బు కోసం గాని, మెటీరియల్ కోసం కాని, ఏ గ్రామం నుంచి ఎవరు కూడా తన వద్దకు రావలసిన అవసరం లేకుండా పనులు జరిగి పోతున్నాయి. ఎన్నికల నిర్వహణలో చంద్రమోహన రెడ్డి అనుభవం, వ్యవస్థీకృత సామర్థ్యం స్పష్టంగా కనపడి పోతున్నది.

ఈ విషయంలో ప్రభాకరరెడ్డి చాలా బలహీనంగా వున్నాడు. ఆయన డబ్బులేని పేదవాడు అయినందు వల్ల

తొరువ 17వపేజీలో

# ప్రసన్నకు చెమట పడ్తోంది!

కోవూరు పరిస్థితిలో ఎంత మాత్రం మార్పు లేదు. ఇంకా చెప్పాలంటే మరింత తీవ్రమైంది. తెలుగుదేశానికి ఎదురు లేదు అనుకున్న చోట కాంగ్రెస్ గట్టి పోటీ ఇవ్వగల్గుతున్నది. ఒక కొత్త చరిత్రకు నాందీ ప్రస్తావన వలె వుంది వాతావరణం.

ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార రెడ్డికి చమటలు పడుతున్నాయి. ఎండకు తిరిగి కాదు, ఎన్నికల వేడి భరించలేక. ఆయన రాజకీయ ప్రవేశం నాటి నుంచి ఇంత వత్తిడి ఎప్పుడు ఎరుగడు. ఎన్నిక అంటే ఒక సరదా కాలక్షేపంగా కొనసాగించే అలవాటు కల్గినవాడు. చావో రేవో తేల్చుకోవాలనే తీరులో పోరాడవలసి వచ్చేసరికి ఉక్కిరి బిక్కిరై పోతున్నాడు. వూపిరాడక విలవిలలాడుతున్నాడు.

ఓటర్లకు ఎమ్మెల్యేలు చేసే అభివృద్ధి పనులు పోలింగ్ సమయంలో జ్ఞప్తికి వచ్చే పనైతే ప్రసన్న ఈ ఎన్నికలో నిమ్మళంగా వుండిపోవచ్చు. నియోజక వర్గం అభివృద్ధి విషయంలో ఏ మాత్రం జాగు చేసి ఎరుగడు. కలెక్టర్ వంటి సాధారణ అధికారులకు కూడా అసాధారణ స్థాయిలో స్వాగతాలు చెప్పి, పూల వాన కురిపించి, మత్తెక్కించి, తతిమా ఎమ్మెల్యేలెవరికీ పోటీడి కూడా అందని పథకాలు, నిధులు తన్నుక పోవడంలో మహా ఘనాపాటి ప్రసన్న. ప్రతి గ్రామంలో ఆయన చేసిన పనులకు ఏదో ఒక గుర్తు వుండి తీరుతుంది. కాని ఇప్పుడు అవేవీ వుపయోగపడడం లేదు. జనం కొత్త కోరుతున్నారు. ఆ వ్యామోహంలో పడిన గ్రామస్తులు ప్రసన్నకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నారు. గత వారంలో ఆయనకు ఊటుకూరు పట్టుపాలెంలో చేదు అనుభవం ఒకటి ఎదురైనది. గ్రామంలో ప్రచారానికి రానివ్వకుండా అడ్డం పడి, నాలుగు గంటల పాటు సతాయించారు. వేగూరు గ్రామంలో ప్రచారానికి వెళ్తే వూళ్లోని వాళ్వెవ్వరూ వచ్చి ముఖం చూపించకుండా అవమానం చేశారు. లేగుంటపాడులో బలహీన వర్గాల ప్రజలు కొందరు ప్రసన్నను అడ్డగించి, ఆగం చేసి, ఘర్షణ వాతావరణం సృష్టించారు. పోలీసు కేసు వరకు వెళ్లింది పరిస్థితి. గండవరం గ్రామంలో సభ జరుపుకుందామన్నా వీలు కాని పరిస్థితి. నార్త రాజుపాళెంలో ప్రచారానికి మనిషి దొరకడం లేదు. బయట వూర్ల నుంచి దిగుమతి చేసుకుని జరిపించుకోవలసి వస్తున్నది. మినగల్లు, పెనుబల్లి, కాగులపాడు తదితర గ్రామాలలోనూ ప్రసన్నను ఎవరో కొత్తవాడు వచ్చినట్లు చూస్తున్నారు జనం. ఇవన్నీ ప్రసన్నకు కంచుకోట వంటి వూళ్లు. ఇంత వరకు కాంగ్రెస్ వాదులకు ప్రవేశం లేనివి. ఒక్క సారిగా శత్రు శిబిరాలుగా మారి పోయాయి.

కేవలం ప్రసన్న మీద ఇంత వ్యతిరేకత పెల్లుబుకుతున్నదని విశ్వసించలేము. తెలుగుదేశం కార్యకర్తలు, నేతల విషయంలో అది నిజమై వుండవచ్చు కాని, సాధారణ ప్రజలకు ఆయన చేసిన అపరాధం ఏదీ లేదు. వారికి అందుబాటులో లేని వాడు కూడా కాదు. నియోజక వర్గ రాజకీయంతోనే రోజులు వెళ్లదీసే రాజకీయవేత్త ఆయన. ఈ వ్యతిరేకతకు కారణం - రాజకీయ వచ్చిన మార్పు వల్లనే వుంటుదన్నది నిజం. మామూలుగా కోవూరులో ఎన్నికల గాలులు పెద్దగా వీచేవి కావు. ఈసారి అవి మరీ ఉద్ధృతం కావడంతో మార్పు స్పష్టంగా కన్పడుతున్నది.

అయితే ఈ మార్పు గెలుపు ఓటములను తారుమారు చేయగల్గే స్థాయిలో వున్నదా లేక సందడి వరకే పరిమితమా అన్నది తేల్చి చెప్పడం కొంచెం కష్టమైన విషయమే. తెలుగుదేశం వాదులు ఎవరితో మాట్లాడినా - మార్పు వుంది

> **పోలింగ్ వరకు ఊపు నిలుస్తుందో లేదో తెలియదు కాని - కోవూరులో కొత్త చరిత్ర ఖాయమన్పిస్తూంది!**

కాని, దాని వల్ల మాకు ఓటమి రాదు అని విశ్వాసం ప్రకటిస్తున్నారు. కాంగ్రెస్ వాదులు, తెలుగుదేశం నుంచి ఇటీవలే వచ్చిన వారు మాత్రం ఇది భూకంపం తెచ్చే ప్రకంపన అని నమ్ముతున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాత్రం గెలుపు పట్ల పూర్తి విశ్వాసంతో వున్నాడు. ఆయన ఏ గ్రామం వెళ్లినా ప్రజలు స్వాగతించే తీరు చూస్తే మనకు కూడా అదే అభిప్రాయం కల్గుతుంది. గతంలో కాంగ్రెస్ వాదులు వూళ్లలోకి వస్తే ముఖం ప్రక్కకు తిప్పుకుని వెళ్లే అలవాటున్న గ్రామాలలో కూడా శ్రీనివాసులు రెడ్డికి బ్రహ్మరథం లభిస్తున్నది. అయినా కొంత మేర డబ్బు వెదజలుతున్న మాట నిజమే. గతంలో ఏ కాంగ్రెస్ అభ్యర్థి కూడా ఇంత వుదారంగా ద్రవ్యాన్ని ద్రవ రూపంలో పారించలేదు. పాత కాంగ్రెస్ వాదులకైతే పండగగా వుంది. ఇంత కాలం ఎన్నిక అంటే ఇక్కడా అక్కడా తామే తడుముకుని, నాలుగు రూకలు పోగేసుకుని ప్రచారం చేయడం వారికి అలవాటు. ఒక్కసారిగా మనసుకు నచ్చిన ఖర్చు పెట్టగలగడంతో మహా ఆనందంగా వున్నారు. అయితే కేవలం డబ్బు ఒక్క దానివల్లే ఈ వూపు వచ్చింది అని భావించలేము. అభ్యర్థి పట్ల విశ్వాసం, చనువు తీసుకునే అవకాశం, చొరవ

తొరువ 17వపేజీలో







# ప్రథమ వర్ధంతి

నా పెద్ద కుమారుడు

**కీ॥శే॥ బి.వి.ఎ. రాజు**

(అరుణ గ్రాఫిక్స్ బాబు)

## సంవత్సరీకము (ఏడూడి)

తేది 22-04-2004 గురువారము
ఉదయం గం॥ 9-00 లకు
నెల్లూరు, గాంధీబొమ్మ సమీపమున
(సాయిబాబాగుడిదగ్గర)
నాగులమిట్టరోడ్డు లోని
మా స్వగృహమునందు జరుగును.
కావున మీకు తెలియజేయడమైనది

ఇట్లు

**బి. ముక్కంటి రాజు**

మరియు **కుటుంబ సభ్యులు**

యాజమాన్యము మరియు సిబ్బంది

**అరుణ గ్రాఫిక్స్**

రాయాజివీధి - నెల్లూరు. ☎ 2325526, 2340587

# మండలాల నాటి ఓట్లే పడినా జిల్లాలో పరిస్థితి తారుమారు!

ఎన్నికల వేళ జోస్యాలంటే అందరికీ మహా మోజు. ఎవరేమి చెప్పినా చెవులు రిక్కించుకుని వింటారు జనం. ఈ నాలుగు వారాలు ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల జోస్యం తప్ప మరొక చర్చ వుండదు. కొండదేవర కనపడినా అదే ప్రశ్న; చెట్టు క్రింద చిలక జోస్యం చెప్పే వాడితోను అదే వాదులాట. ప్రతి ఎన్నికలకు ఇదొక ఆనవాయితీ. ఈ ఆసక్తిని కనిపెట్టి రకరకాల సంస్థలు పలు రకాల సర్వేలతో జనాన్ని అయోమయ పరుస్తున్నాయి. ఏ ఇద్దరు జ్యోతిష్యులు ఒక మాట చెప్పనట్లే, ఏ రెండు సర్వేలు కూడా ఒక తీరులో వుండవు. దాని అర్థం ఓటరు నాడి పసి కట్టడం ఎవరి తరం కాదని. అయినా వూరకుండలేరు ఎవరు. తోచిన రీతిలో ప్రతి ఒక్కరు ఏదో ఒక ఎన్నికల వూహాగానం చేస్తూనే వుంటారు.

ఇప్పుడిక్కడ ఇస్తున్నది కూడా అటువంటిదే. అయితే ఇది జోస్యం కాదు; లెక్క. 2001లో జరిగిన మండలాల ఎన్నికలలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయి అనే లెక్క ప్రాతిపదికగా తీసుకుని చెప్తున్న అంచనా. ఆ ఎన్నికల నాటికి తెలుగుదేశం ప్రభుత్వం అత్యంత సుస్థిరంగా వుంది; కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు నిర్వేదంలో వున్నారు. వారి దగ్గర డబ్బు, అధికారం, అంగబలం తదితర హంగులన్నీ పుష్కలం. కాంగ్రెస్ గ్రామ స్థాయి నేతలు వరస పరాజయాలతో ఆర్థికంగా చతికల పడిపోయి వున్నారు. జన్మభూమి, పనికి ఆహారం వంటి పథకాలతో ప్రతి తెలుగు కార్యకర్తా పచ్చగా వెలిగి పోతున్న రోజులవి. ఆ స్థితిలో ఎన్నికలు అంటే తెలుగుదేశం పార్టీకి పూర్తి ఆధిక్యత రావాలి. కాని అది జరగలేదు. గత శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు నాలుగు స్థానాలు; తెలుగుదేశానికి ఏడు స్థానాలు వచ్చాయి. కాని ఈ మండలాల ఎన్నికలలో పోలైన ఓట్లను చూస్తే ఎనిమిది స్థానాలలో కాంగ్రెస్‌కు ఆధిక్యత వస్తున్నది; తెలుగుదేశం కేవలం మూడంటే మూడు స్థానాలలో ఆధిక్యత సంపాదించింది. అంటే పరిస్థితి పూర్తిగా తారు మారై పోయిందన్న మాట. కోవూరు, కావలి, ఉదయగిరిలలో మాత్రమే తెలుగుదేశం పెచ్చుగా వుంది; రాపూరు, సర్వేపల్లి, అల్లూరు, ఆత్మకూరు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరిలలో కాంగ్రెస్ మెరుగైంది. నెల్లూరు స్థానాన్ని పరిగణనలోకి తీసుకో లేదు. అది పూర్తిగా పట్టణ ప్రాంతం కాబట్టి ఒక్క ఎమ్పీటీసి స్థానం కూడా లేదు.

ఎమ్పీటీసి అంటే ఇంచుమించు పంచాయతితో సమానం. రెండు లేదా మూడు వూళ్లు కలిసి ఒక ఎమ్పీటీసి అవుతుంది. అంత దిగువ స్థాయిలో ఎన్నిక అంటే పోటీ హోరా హోరీగా వుండడం సహజం. స్థానిక అంశాల ప్రాతిపదికగా జరుగుతుంది. ఆ స్థితిలో సాధారణంగా అధికార పార్టీకి అనుకూలత జాస్తి. ఆ ఎమ్పీటీసి ఎన్నికలను ప్రతి తెలుగుదేశం ఎమ్మెల్యే కూడా వ్యక్తిగత ప్రతిష్టగా పోరాడారు. కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌ఛార్జిలు అన్యమనస్కంగా ఎన్నిక జరిపించారు. ఒక్క ఆత్మకూరులో

తరువ 23వ పేజీలో

## ఎంపిటిసి ఎన్నికల్లో ఓటింగ్ సరళి

2001లో జరిగిన మండలాల ఎన్నికల్లో ఎంపిటిసిల వారీగా వచ్చిన ఓట్లు కూడి దిగువ ఇస్తున్నాము. నియోజకవర్గాల వారీ ఎంపిటిసిల విభజనలో సరైన స్పష్టత లేకపోవడం వల్ల లెక్కల్లో స్వల్ప తేడా వుండవచ్చు.

| నియోజక వర్గం | మొత్తం పోలైన ఓట్లు | టిడిపి | బిజెపి | కాంగ్రెస్ | సిపిఎం | టిడిపి,కాంగ్రెస్‌ల మధ్య మెజారిటి |
|---|---|---|---|---|---|---|
| కోవూరు | 77257 | 34599 | 4712 | 28866 | 6682 | 5733(తె.దే) |
| అల్లూరు | 80033 | 35500 | 3422 | 36504 | 3986 | 1004(కాం) |
| కావలి | 76772 | 37940 | 2065 | 35770 | 403 | 2170(తె.దే) |
| ఉదయగిరి | 72057 | 36258 | 564 | 33455 | 1701 | 2803(తె.దే) |
| రాపూరు | 95491 | 41717 | 2900 | 45400 | 3538 | 3683 (కాం) |
| ఆత్మకూరు | 112295 | 51719 | 4058 | 53559 | 1153 | 1840(కాం) |
| వెంకటగిరి | 110511 | 53182 | 1798 | 53878 | 246 | 696(కాం) |
| సర్వేపల్లి | 96451 | 38707 | 4804 | 45450 | 6322 | 6743 (కాం) |
| గూడూరు | 88971 | 38678 | 3986 | 44339 | 159 | 5661 (కాం) |
| సూళ్లూరుపేట | 97820 | 45991 | 2616 | 46809 | 298 | 818 (కాం) |

### ఉదయగిరి

| గ్రామం పేరు | టిడిపి | కాంగ్రెస్ | బిజెపి | సిపిఎం |
|---|---|---|---|---|
| గుండుపల్లి | 757 | 1387 | | |
| సీతారాంపురం - I | 636 | 1154 | | |
| నెమ్మళ్లదిన్నె | 916 | 725 | | |
| సీతారాంపురం - II | 606 | 668 | | |
| సింగారెడ్డి పల్లి | 700 | 790 | | |
| బసినేని పల్లి | 1305 | 533 | | |
| ఆర్లపడియ | 763 | 806 | | 13 |
| గండిపాళెం | 646 | 763 | | 68 |
| తిరుమల పురం | 709 | 665 | | |
| కొండాయపాళెం | 970 | 756 | | |
| బండగానిపల్లి | 668 | 1099 | | 96 |
| ఉదయగిరి - I | 426 | 834 | | 134 |
| ఉదయగిరి - II | | 1534 | 564 | |
| గంగులవారిచెరువుపల్లి | 749 | 754 | | |
| అప్ప సముద్రం | 876 | 865 | | |
| పెద్దిరెడ్డి పల్లి | 840 | 514 | | |
| విరువూరు | 833 | 964 | | |
| తోటల చెరువుపల్లి | 1124 | 541 | | |
| రామాపురం | 1045 | 913 | | |
| తిమ్మారెడ్డిపల్లి | 774 | 771 | | |
| గువ్వాడి | 690 | 511 | | 472 |
| వరికుంటపాడు | 1037 | 914 | | |
| జడదేవి | 1181 | 437 | | |
| రెడ్డుపాడు | 736 | 712 | | |
| నర్రవాడ | 916 | 648 | | |
| బోడవారి పల్లి | 659 | 513 | | |
| దుత్తలూరు | 1569 | 1049 | | |
| ఏరుకల్లు | 610 | 634 | | |
| నందిపాడు | 1047 | 839 | | |
| భైరవరం | 1078 | 824 | | 9 |
| కంపసముద్రం | 201 | 1787 | | |
| సింగన్నపల్లి | 475 | 1080 | | |
| పడమటి నాయుడుపల్లి | 1064 | 925 | | |
| బూదవాడ | 1113 | 1161 | | |
| ఊర్లపాడు | 575 | 985 | | 203 |
| పల్లవోలు | 813 | 712 | | 583 |
| భీమవరం | 902 | 510 | | 123 |
| చిన్నమాచనూరు | 840 | 817 | | |
| నందవరం | 1273 | 844 | | |
| దాసలకొండ | 967 | 767 | | |
| ఊటుకూరు | 760 | 1070 | | |
| గరిమెనపెంట | 945 | 741 | | |
| తూర్పు ఎర్రబల్లి | 1469 | 1134 | | |
| గొట్టిగుండాల | 750 | 810 | | |

## హడలెత్తిస్తున్న విజయభారతి!

ఒంగోలు తెలుగుదేశం ఎమ్పీ అభ్యర్థిని విజయభారతి దెబ్బకు ఆ నియోజక వర్గంలోని ఎమ్మెల్యే అభ్యర్థులంతా హడలి పోతున్నారు. ఆమె రాజకీయాలకు కొత్త; నిన్నటి వరకు ఒక సాధారణ వుద్యోగిని; అయితే ఆమె ఆ ధోరణిలో లేదు అభ్యర్థులంతా తాను చెప్పినట్లే ప్రచారం చేయాలని దబాయిస్తున్నదట. అమ్మా ఆ పద్ధతిలో వెళ్తే




నష్టపోతాం అంటే విన్పించుకోవడం లేదట. మరొక ప్రక్క కర్నూలు, మహబూబ్‌నగర్ల నుంచి 500 మంది డ్వాక్రా మహిళలను రప్పించారు. వారికి సౌకర్యాల కల్పనలో చిన్న పొరపాటు జరిగినా ఎమ్మెల్యే అభ్యర్థుల తల వాచి పోతున్నది. ఈమెతో వేగడం ఎట్లా బాబో అని తలలు పట్టుకుంటున్నారు వారు. మంత్రి దామచర్ల ఆంజనేయులు అయితే విజయభారతి కన్పిస్తే ముఖం ప్రక్కకు తిప్పుకుని వెళ్లి పోతున్నారట.

### కావలి

| గ్రామం పేరు | టిడిపి | కాంగ్రెస్ | బిజెపి | సిపిఎం |
|---|---|---|---|---|
| నేకునంపేట | 1125 | 1082 | | |
| చింతలదేవి | 1018 | 834 | | |
| గూడవల్లూరు | 992 | 940 | | |
| సత్యవోలు | 622 | 614 | | |
| గానుగపెంట | 749 | 597 | | |
| సాయిపేట | 1893 | 1391 | | |
| కొమ్మి | 1332 | 1232 | | |
| కొత్తపల్లి | 727 | 923 | | |
| చలంచర్ల | 980 | 806 | | |
| మద్దూరుపాడు | 809 | 801 | | |
| రుద్రకోట | 1092 | 999 | | |
| చెన్నాయపాళెం | 1312 | 1126 | | |
| అన్నెమడుగు | 928 | 744 | | |
| సర్వాయపాళెం | 730 | 827 | | |
| తుమ్మలపెంట | 1420 | 1180 | | |
| మన్నెంగిదిన్నె | 764 | 780 | 51 | |
| బుడంగుంట | 939 | 721 | | |
| ముసునూరు | 127.7 | 1958 | | |
| తాళ్ళపాళెం | 1070 | 992 | | |
| అన్నగారిపాళెం-1 | 902 | 606 | | |
| అన్నగారిపాళెం-2 | 762 | 952 | | |
| కేశవరం | 1010 | 664 | | |
| గట్టుపల్లి | 1248 | 1161 | | |
| జమ్మలపాలెం | 733 | 1019 | | |
| జలదంకి-1 | 714 | 791 | | 150 |
| జలదంకి-2 | 721 | 873 | 35 | 66 |
| చినక్రాక | 921 | 154 | 398 | |
| బ్రాహ్మణక్రాక-1 | 1159 | 519 | | 187 |
| బ్రాహ్మణక్రాక-2 | 1222 | | 421 | |
| దుండిగం | 975 | 1061 | | |
| బోడిగుడిపాడు | 901 | 794 | | |
| గంగిరెడ్డిపాళెం | 1093 | 1158 | | |
| క్రిష్ణారెడ్డిపాళెం | 1019 | 709 | | |
| వీరన్నకల్లు | 1054 | | 1056 | |
| కలిగిరి-1 | 767 | 798 | | |
| కలిగిరి-2 | 712 | 874 | | |
| పెద్దకొండూరు | 1189 | 1022 | 30 | |
| చిన్న అన్నలూరు | 723 | 721 | | |
| క్రాసుటూరు | 1156 | 1054 | | |
| సిద్దనకొండూరు | 1161 | 927 | 68 | |
| అనంతపురం | 1133 | 1360 | | |

# ఆదాల - మన ఆశాకిరణం





కష్టాలతో కునారిల్లుతున్న
రైతాంగానికి ఆదాల ఆశాకిరణం
కూడు, గూడు లేని పేదలకు
ఆదాల నాయకత్వం వరప్రసాదం
అభివృద్ధికి ఆయనొక నిర్వచనం
నిస్వార్థ ప్రజాసేవకు ప్రతిరూపం
సర్వేపల్లి నియోజకవర్గానికి
ఆదాల నేతృత్వం అభిలషణీయం



**కాంగ్రెస్ హస్తం పేదల నేస్తం**

**పోలింగ్ తేది: 26-04-2004**

కోవూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

Space Donated by Nellore Dist, Congress Committee

# కులాల ఉచ్చులో చిక్కుకోనున్న అల్లూరు రాజకీయం!

అల్లూరులో బీదా మస్తాన్‌రావు సంచలనం సృష్టిస్తున్నాడు; కాంగ్రెస్ వాదులకు చలి జ్వరం తెప్పిస్తున్నాడు. ఆషామాషీగా జరిగిన పరిణామం కాదిది. పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకోవడంలో బీదా సోదరులు చూపుతున్న నేర్పు చాతుర్యం, కఠోర పరిశ్రమల ఫలితం అది. నిజంగా వారి కృషి ఆశ్చర్యం గొలుపుతున్నది. సన్నిహిత అనుచరులై వుండి కూడా ఆదాల ప్రభాకరరెడ్డి వెంట తెలుగుదేశం పార్టీని వదిలి రానందుకు - చెడ్డ బుద్ధులు పుడుతున్నాయని అందరూ నిందించారు; పోటీకి సిద్ధమైనప్పుడు - చంద్రబాబు వారిని బలి పశువులుగా మార్చాడనే వ్యాఖ్యానం విన్పడింది; సువ్యవస్థితమైన పార్టీ యంత్రాంగం, వ్యక్తిగతంగా మంచి పేరు, రాజకీయ అనుభవం, కుటుంబ ప్రతిష్ట, బంధుజనం, గతంలో ఓడిపోయాడన్న సానుభూతి వంటి అర్హతలన్నీ కల్గిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని వీరెంత మాత్రం ప్రతిఘటించలేరు - అని చాలా మంది పెదవి విరిచారు. కాని పోలింగ్ ఒక వారం రోజుల దగ్గరకు వచ్చేసరికి ఆ వ్యాఖ్యలు చేసినవారు, ఆ అనుమానాలు వ్యక్తం చేసిన వారు ఆశ్చర్యంతో నోరు వెళ్లబెట్టే పరిస్థితి కల్పించుకున్నారువారు.

## తెలుగుదేశానికి అభ్యర్థి బలం - కాంగ్రెస్‌కు పార్టీ శక్తిమంతం; రెండింటిలో గెలుపు వూహా అనూహ్యం!

అల్లూరు నియోజక వర్గంలోని ఏ గ్రామం వెళ్లినా మస్తాన్‌రావు పేరు మార్మోగి పోతున్నది ఇప్పుడు. చాప క్రింద నీరు వలె, నిశ్శబ్దంగా అల్లుక పోయింది ఆయన అభ్యర్థిత్వం. ఎక్కడా తొట్రుపాటు లేకుండా, వివాదాలలో తల దూర్చకుండా, ఎవరినీ పల్లెత్తు మాట అనకుండా, సందడి చేయకుండా వూళ్లలోకి చొచ్చుకొని పోయాడాయన. ప్రచారం కూడా సంస్కారయుతంగా నిర్వహించడం మెచ్చుకోదగిన విషయం. తతిమా నియోజక వర్గాలలో వలె ఇక్కడ వ్యక్తిగత నిందలు, నిష్టూరాలు లేవు. అటు విష్ణు, ఇటు మస్తానయ్యలు ఇరువురూ తమ గురించి తాము చెప్పుకోవడం, తమ పాట్లు తాము పడడం తప్ప ఒకరి మాట మరొకరు పొరపాటున కూడా ఎత్తడం లేదు. మంచి సంప్రదాయం ఇది.

అయితే ఇల్లలకగానే పండుగ కాదు; ప్రచారంలో సఫలం కాగానే విజయం సిద్ధించదు. మొదటి రెండు వారాలలో విష్ణు ప్రచారం కొంత మేర నిదానించినందువల్ల మస్తానయ్య పేరు జనం నోట్లో నానిన మాట నిజం. అయితే గత ఒకటి రెండు రోజులుగా విష్ణు కూడా ప్రచారాన్ని వుధృతం చేశాడు. పరిస్థితి చెయ్యి దాటుతున్నదని సందేహించాడేమో తెలియదు కాని, భేషజాలు వదలి - అటు పాత కాంగ్రెస్ వాదులను, ఇటు కొత్తగా తెలుగుదేశం నుంచి వలస వచ్చిన వారిని కలుపుక పోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ పని మొదటిలోనే చేసి వుంటే ఇంత దూరం వచ్చేది కాదనడం నిజం. ఈ ఆలస్యాన్ని మస్తానయ్య తనకనుకూలంగా మల్చుకున్నాడు. ఊగిసలాటలో వుండిన వలస పక్షులన్నింటినీ వెనక్కు రప్పించుకున్నాడు. ఆదాల ప్రభాకరరెడ్డితో వ్యక్తిగత మొగమాటాలు కల్గిన వారు తప్ప, తతిమా వారందరూ వచ్చిన దారిలోనే వెనక్కు వెళ్లిపోయారు. అయితే ఈ తిరుగు ప్రయాణం తెలుగుదేశం వారికే పరిమితం. కాంగ్రెస్ నుంచి ఒక్క పిట్ట కూడా కదలలేదు.

మస్తానయ్య ధన వ్యయం నియోజక వర్గమంతా కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. అందులో నిజంపాలు కంటే, పుకార్ల జోరు జాస్తిగా వుండి వుండవచ్చు. అయితే, పైసా అనే అయస్కాంతానికి ఆకర్షింపబడే వారందరినీ తన వైపుకు తిప్పుకున్నాడాయన. చీపురు పుల్ల సహాయం వస్తుందని తెలిసినా పరుగెత్తుక వెళ్లి ప్రాధేయ పడుతున్నారు. పెద్ద వారైతే చేతులు పట్టుకుని బ్రతిమలాడుతున్నారు; చిన్న వారైతే ప్రక్కన కూర్చుని బుజ్జగిస్తున్నారు. వశీకరణ విద్యలో ఎన్ని పాఠాలు వున్నాయో అన్నింటినీ వల్లె వేస్తున్నారు. దాని ఫలితమే ఈ సంచలనం.

అయితే ఈ ప్రచార ప్రావీణ్యం ఓటర్ల వరకు వెళ్లిందా లేక గ్రామ స్థాయి నాయకులకే పరిమితమయ్యిందా అన్నది స్పష్టం కావడం లేదు. తమకు పరిచయం లేని అభ్యర్థి ప్రచారం జోరుగున్నంత మాత్రాన, ఓటరు భ్రమలో పడి పోతాడా అన్నది ప్రశ్న. అది అంత సులువు కాక పోవచ్చు. ఓటు ఎవరికి వేయాలి



పిల్లలను మంచి చేసుకొంటేనైనా తల్లుల మనసు కరుగుతుందని - కన్పడిన ప్రతి పిల్లవాడికీ చాక్లెట్స్ పంచుతున్నాడు బీద మస్తాన్‌రావు.

అనే నిర్ణయంలో అభ్యర్థి ఎవరన్నది కీలక పాత్ర వహిస్తున్న మాట నిజమే కాని, అదొక్కటే ప్రామాణికం కాదు. ఓటరు నిర్ణయంలో అభ్యర్థి పాత్ర పరిమితం; పార్టీ అభిమానం అధికం. పార్టీకి




ఆత్మకూరు మండలం మహిమలూరులో బిజెపి అభ్యర్థి బొల్లినేని కృష్ణయ్యకు తిలకం దిద్ది ఆశీర్వదిస్తున్న మహిళా ఓటరు.

బలం వుంటే అభ్యర్థి బలహీనతలు మరుగున పడి పోతాయే తప్ప; పార్టీ బలహీనమైనప్పుడు అభ్యర్థి తన బలంతో బయట పడడం అరుదుగా తప్ప జరగదు.

అల్లూరులో ఇప్పుడు ఏ పార్టీ బలంగా ఉంది అన్నది తెలిస్తే - ఎవరికి విజయావకాశాలు ఎక్కువ అన్న ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. గత ఎన్నికల తీరు పరిశీలిస్తే అల్లూరులో రెండు పార్టీలదీ సమబలం. పోయిన సారి ఆదాల ప్రభాకరరెడ్డి గారు కోట్లు కుమ్మరించినా - విష్ణు సాదా సీదా ఎన్నిక జరిపినా - ఇద్దరికీ మధ్య తేడా చాలా కొంచం. అప్పటిలో తెలుగుదేశం గాలి వుండింది; సిపిఎం ఓట్లు ప్రభాకరరెడ్డికి పడ్డాయి. ఇప్పుడు ఆ గాలి లేదు; పై పెచ్చు తెలుగుదేశం వ్యతిరేక పవనాలు తుఫాన్ గాలుల వలె వీస్తున్నాయి. సిపిఎం ఓట్లు కొన్నైనా కాంగ్రెస్‌కు పడే అవకాశం వున్న సంగతి కూడా గుర్తు పెట్టుకోవాలి. ఈ పరిస్థితులన్నీ విశ్లేషణ చేసుకోగల్గితే

తరువాయి 14వ పేజీలో


## రాపూరు 'సిరి' ఎల్లసిరి



ఎన్నికలతో నిమిత్తం లేదు
పదవులతో పని లేదు
వేరే కోరికమేదీ లేదు
ఎన్నికలై పోయిన తర్వాత
ఎక్కడకు వెళ్లి వెతకాలోననే చింత లేదు
పదవి వస్తే పై మేత ఎక్కువౌతాడేమోననే
సందేహం లేదు
ఎప్పుడు ఎవరు పిలిచినా
అర్ధరాత్రి అవసరం పడినా
నేనున్నానంటూ ముందుకు వచ్చే
పదహారణాల ప్రజల మనిషి
ప్రజలతో, ప్రజల మధ్య
ప్రజల కోసం ప్రతిదినం
ప్రతిక్షణం కాలం గడిపే
ప్రజా సేవకుడు, రాపూరు తెలుగుదేశం అభ్యర్థి
**ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి** గారి సైకిల్ గుర్తుపై
మీ పవిత్రమైన ఓటు ముద్ర వేసి గెలిపించ ప్రార్థన.



సైకిల్ గుర్తుకే మన ఓటు



ఇ.అనిల్‌కుమార్‌రెడ్డి
మండలపరిషత్ అధ్యక్షులు
రాపూరు



ఎస్.రాధాకృష్ణయ్య
చింతలాత్మకూరు
తె.దే. గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు




టి.నాగరాజారావు
చింతలాత్మకూరు
తె.దే. గ్రామ పార్టీ కార్యదర్శి



ఐ.సిద్ధయ్య
చింతలాత్మకూరు
తె.దే. గ్రామ పార్టీ అధ్యక్షుడు



## పదవీ విరమణ శుభాకాంక్షలు



M.Prabhakara Reddy
B.Com., B.L.D.I.C.,P.M.I.R.
Secretary,
NELLORE CO-OP. HOUSE BUILDING SOCIETY LTD.,

నీతి నిజాయితీ ఆమడదూరంలో
నడుస్తున్న ఈ రోజుల్లో,
నెల్లూరు కో-ఆపరేటివ్ హౌస్‌బిల్డింగ్
సొసైటీ లిమిటెడ్ సెక్రటరీగా 34సం॥
నిస్వార్థంగా సేవలందించి,
అందరి అభిమానం చూరగొని, పదవీ
విరమణ చేసిన సందర్భంగా
మా **'ప్రభాకరుడు'**
మరియు వారి కుటుంబం
సుఖ-శాంతులతో వర్ధిల్లాలని
కోరుకుంటూ...

మేనేజింగ్
డా.జి.కొండారెడ్డి

డా.కొండారెడ్డి దంత వైద్యశాల
శంకరాగ్రహారం, నెల్లూరు-1.
ఫోన్: 2327235

# అధికారుల అలసత్వంతో అభ్యర్థులకు హాయిగా వుంది!

ఎన్నికలలో పోటి చేసే అభ్యర్థులకు ఈసారి ప్రాణం సుఖంగా వుంది. నిబంధనల పేరిట వారిని సతాయించే వారే లేరు. గత ఎన్నికలలో అభ్యర్థులు క్షణమొక యుగంగా గడిపిన సంగతి తెలిసిందే. ఒక సభ పెట్టాలన్నా, ఒక వూరేగింపు తీయాలన్నా హడలి చచ్చేవారు. వ్యయ పరిశీలకులు ఒక ప్రక్క, పోలీసులు మరొక ప్రక్క చేరి సతాయించేవారు. జరిగిన ప్రతి సభను వీడియో తీయించి, ఖర్చు లెక్క కట్టి, అభ్యర్థులు ఇచ్చే లెక్కలతో నిమిత్తం లేకుండా, అప్పటి కలెక్టర్లే లెక్క వేసే వారు. 1994 ఎన్నికలలో నెల్లూరు కాంగ్రెస్ అభ్యర్థి ఖర్చు పరిమితి దాటి పోతున్నాడని; పోటీకి అనర్హుడని ప్రకటించవలసి వస్తుందని హెచ్చరిక చేశాడు అప్పటి కలెక్టర్ సాంబశివరావు.

ఇప్పుడు పేచీలు ఏవీ లేవు. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎక్కడున్నారో, ఏమి చేస్తున్నారో అర్థమే కావడం లేదు. మండల కేంద్రంలో ఒక వీడియో పెట్టారు; అది ఎందుకూ చాలక పోవడంతో అభ్యర్థుల ప్రచార దృశ్యాలు తీయడానికి పంపడమే లేదు. రాత్రి 10గంటలకు ప్రచారం నిలపాలన్న నియమం కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. పల్లెలలో అర్ధరాత్రి దాటి, వేకువన రెండు గంటల వరకు సభలు జరుగుతూనే వున్నాయి. వాహనాల పరిమితి కూడా ఎవరూ పాటించడం లేదు. ఒక్కొక్క అభ్యర్థి వెనుక పాతిక ముప్పై కార్లు బారులు తీరుతున్నాయి. గత ఎన్నికలలో అభ్యర్థులు తమ వెంట మూడు లేదా నాలుగు కార్లు కన్పడినా భయపడి పోయేవారు.

బ్యానర్లు, జెండాల విషయంలో మాత్రం పోలీసులు కొంచెం నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. ఎవరినీ కట్టనివ్వడం లేదు; ఒకవేళ కట్టినా వెంటనే పీకి పడేస్తున్నారు.

జిల్లా అధికార యంత్రాంగం మెలకువగా వ్యవహరిస్తే తప్ప ఎన్నికల నియమాలు పాటింప చేయడం సాధ్యం కాదు. మన కలెక్టర్ అనంతరాము గారికి అంత ఓపిక లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చూద్దాం, అంత వరకు వాటి జోలికి వెళ్లవద్దని తన సిబ్బందికి చెప్తున్నారాయన. రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ల మీద నడవడం మామూలే కదా?



నేలపైన శవమై పడివున్న సోమిరెడ్డి హర్షవర్ధనరెడ్డి

# హర్ష - విషాద మరణం!

జిల్లా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి సోదరుడు హర్షవర్ధనరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. 15తేది రాత్రి ఎప్పుడో జరిగి పోయినట్లుంది ఈ విషాదం. ఆ రోజు మధ్యాహ్నం వరకు మామూలుగానే వున్నాడట. గొలగమూడి, అనికేపల్లి గ్రామాలలో తన అన్న తరఫున ఎన్నికల ప్రచారం కూడా చేశాడు. మధ్యాహ్నం మీదట ఎవరికీ చెప్పకుండా అదృశ్యమై పోయాడు. ఆ రాత్రంతా ఎదురు చూసినా తిరిగి రాలేదు. ఎక్కడుండేది తెలియలేదు. దానితో ఆందోళన చెందిన మంత్రి - పోలీసుకు సమాచారం ఇచ్చాడట. వారు టౌన్‌లోని అన్ని ముఖ్య హోటళ్లు వెతకడంతో పాటు; ఆయన కారు మద్రాసు వైపు వెళ్లిందేమోనని చూడడానికి టోల్‌గేటు దగ్గర కంప్యూటర్ సైతం పరిశీలించి చూశారు. కాని ఆచూకీ దొరకలేదు. 16తేది మధ్యాహ్నానికి కొందరు స్నేహితులు పోబిడీ కనిపెట్టారట - హోటల్ అనురాగ్‌లో వున్నాడని. అక్కడకు వెళ్లి తలుపు తడితే తీయక పోయే సరికి, పోలీసును పిలిపించి, తలుపు పగలకొట్టి చూసే సరికి లోపల నేల మీద శవమై పడి వున్నాడు. పురుగుల మందు, బ్రాంది కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నాడని అర్థమైంది. ముందు రోజు రాత్రే ప్రాణం పోయినట్లుంది పాపం.

15తేది మధ్యాహ్నం హోటల్‌కు వచ్చి గది తీసుకున్నాడని; రాత్రి సమయంలో హోటల్ బాయ్ చేత బ్రాంది, పెరుగన్నం తెప్పించుకున్నాడని చెప్తున్నారు. తాను పిలిచే వరకు తన గది తలుపు ఎవరూ తట్టవద్దని హోటల్ సిబ్బందికి చెప్పినాడట. దానితో వారు ప్రక్క రోజు తెల్లవారిన తర్వాత కూడా ఆ గది జోలికి వెళ్లలేదు. లోపల నిద్ర పోతున్నాడని భావించి వూరకుండి పోయారు. ఇంత ఘోరం జరుగుతుందని వారు వూహించలేరు కదా?

హర్షవర్ధన రెడ్డి మొదటి నుంచి చంచల స్వభావి; ఉద్రేకపరుడు. గతంలో కూడా రెండు సార్లు ఆత్మహత్యా ప్రయత్నాలు చేశాడు. కాని అదృష్టం బాగుండి బ్రతికాడు. ఈసారి మృత్యుదేవత కౌగిలి నుంచి తప్పించుకోలేక పోయాడు. ఆర్థిక సమస్యలే ఈ దారుణానికి పురికొల్పి వుంటాయని అంచనా. శవం ప్రక్క ఒక ఉత్తరం దొరికింది కాని, అందులో చావుకు కారణం అంటూ ఏదీ పేర్కొనలేదు. తన కుమారుడికి జాగ్రత్తలు మాత్రం చెప్పాడు. ఆ తర్వాత కొంతసేపటికి ఆయన సోదరి ఇంట్లోని సూట్‌కేసులో మరొక జాబు దొరికింది. అందులో ఆదాల ప్రభాకరరెడ్డిని ఓడించి, తన అన్న చంద్రమోహన రెడ్డిని గెల్పించమని సర్వేపల్లి ఓటర్లకు విజ్ఞప్తి వుంది.

గత ఎన్నికల సమయంలో తన అన్నతో విభేదించి, అన్నపైనే స్వతంత్రుడిగా పోటీ చేసి సంచలనం సృష్టించాడు హర్ష. ఆ తర్వాత సర్దుకు పోయి, అన్నతో కలిసి వుండేవాడు. ఇటీవలనే అల్లీపురంలోని తన ఇంటిని అన్నకే అమ్మేశాడు. కుమార్తె పెండ్లి చేశాడు. ఆ పెళ్లి చంద్రమోహన రెడ్డి ఆధ్వర్యంలోనే జరిగింది. ఈ ఎన్నికలకు అన్న తరఫున ప్రచారం చేయడానికి మద్రాసు నుంచి వచ్చి, గత పది రోజులుగా నెల్లూరులోనే వున్నాడు. ఏమి జరిగిందో ఏమో కాని ఇంత అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

హర్షకు భార్య, కుమార్తె, ఒక కుమారుడు వున్నారు. వారి కుటుంబానికి మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాము.



రాపూరు నియోజకవర్గం బురాన్‌పూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నెల్లూరు లోక్‌సభ, రాపూరు అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థులు పనబాక లక్ష్మి, ఆనం రామనారాయణరెడ్డి.

# సర్వేపల్లిలో క్రికెట్ జోరు!

పల్లెలలో కుర్ర పిల్లలకు క్రికెట్ కిట్లు పందారం చేయడం అందరు అభ్యర్థులకు అలవాటై పోయింది. వాటి వల్ల ఓట్లు వచ్చినా రాకపోయినా ఆ పిల్లమూక తమ పేరు వూరంతా చాటింప వేస్తుందన్నది ఆశ. ఈసారి అందరికంటే ముందుగా సర్వేపల్లిలో సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి ఈ పందారం చేశారు. గత ప్రభుత్వంలో క్రీడల మంత్రిగా వేలాది క్రికెట్ కిట్లు కొని, పంచిన అనుభవం వుంది ఆయనకు. ఆ అలవాటు ఇంకా మానినట్లు లేదు. ఆయన 150 కిట్లు తెప్పించి ఇచ్చాడని తెలుస్తున్నది. అయితే ఆ వార్త అందగానే ఆదాల ప్రభాకరరెడ్డి 250కిట్లు తెప్పించి పంపకం చేశాడట. వీరిద్దరి పుణ్యాన సర్వేపల్లిలోని ప్రతి గ్రామంలో క్రికెట్ ఆట జోరుగా జరుగుతున్నది.

తిరుపతి లోక్‌సభ అభ్యర్థి చింతామోహన్ కూడా ఒక లారీ నిండా కిట్లు తెప్పించాడు. అయితే ఆ సమాచారం బిజెపి వాళ్లకు తెలిసి, అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు చింతామోహన్ ఇంటికి వెళ్లేసరికి లారీ దొరికింది; మొత్తం కిట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఖరీదైన వ్యవహారం ఇది. ఒక్కొక్క కిట్ ధర రెండువేల వరకు వుంటుందట. పాపం అన్ని లక్షలు పోసి కొన్నా, ఫలితం లేకుండా పోయింది చింతామోహన్‌కు.

# సోనియాగాంధీ వస్తున్నారు!

జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీ 23తేది ఉదయం నెల్లూరు రానున్నారు. మిట్ట మధ్యాహ్నం 11.30 గంటలకు టౌన్‌లో జరిగే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. తిరుపతి నుంచి హెలికాప్టర్‌లో వస్తున్నారామె. నెల్లూరు తర్వాత ఒంగోలు వెళ్తారు. అనుకోకుండా ఏర్పాటైన కార్యక్రమం ఇది. రెండంటే రెండు రోజుల వ్యవధిలో అంత పెద్ద సభకు ఏర్పాట్లు చేయడం జిల్లా కాంగ్రెస్ పార్టీకి తలకు మించిన భారం కాబోతుంది. ఏర్పాట్లన్నీ ఆనం సోదరులు, ఆదాల ప్రభాకరరెడ్డిలకు అప్పజెప్పారు.

## వైఎస్

రాష్ట్ర కాంగ్రెస్ నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ రోజు (19తేది) నెల్లూరు జిల్లాలో పర్యటించారు. ఈ వార్త వ్రాసే సమయానికి ఆయన టౌన్‌లో రోడ్‌షో నిర్వహిస్తున్నారు. సాయంత్రం మద్రాసు బస్టాండు దగ్గర నెర్తాలా బొమ్మ కూడలిలో సభ జరుగుతుంది. ఉదయం దుత్తలూరు నుంచి మొదలైంది పర్యటన. ఆత్మకూరులో పెద్ద బహిరంగ సభ. నాలుగైదు వేల మంది జనం హాజరైనారు. స్పందన కూడా బాగుందని సమాచారం. ఆ తర్వాత సంగంలో జరిగిన సభ చాలా పల్చగా వుండింది. బుచ్చి ఫర్వాలేదు. కోవూరులో మంచి జనం. నెల్లూరు రోడ్‌షో జన సమ్మర్థంగా జరుగుతున్నది. ఇక్కడ నుంచి వెంకటాచలం, మనుబోలు, గూడూరుల మీదుగా నాయుడుపేట చేరుకుంటారు. రాత్రికి అక్కడే మకాం. రేపు ఉదయం కాళహస్తి వెళ్తారు.

## జనార్ధనరెడ్డి

మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారు 21తేది మధ్యాహ్నం నుంచి నెల్లూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణ చేపట్టనున్నారు. 20తేది విశాఖపట్నంలో పోలింగ్ చూసుకుని, ఆ రాత్రికే మద్రాసు వస్తారు. ఉదయం సూళ్లూరుపేట. అక్కడొక బహిరంగ సభలో మాట్లాడుతారు. సాయంత్రం వెంకటగిరి వెళ్లి ఎన్నికల వ్యవహారాలు పరామర్శించి నెల్లూరు వస్తారు. సోనియా గాంధీ సభ ఏర్పాట్లు సమీక్షిస్తారు. 26తేది పోలింగ్ ముగిసే వరకు నెల్లూరు జిల్లాలోనే పర్యటిస్తారు.

## సినీ తారల తళుకులు

తెలుగుదేశం, బిజెపి అభ్యర్థుల తరఫున ప్రచారం చేయడానికి సినీ తారలు పెద్ద సంఖ్యలోనే నెల్లూరు వచ్చారు; వస్తున్నారు. 15తేది ఉదయం నటి రంభ వచ్చింది. శెట్టిగుంటరోడ్డు దగ్గర నుంచి ఒక రోడ్‌షో నిర్వహించింది. ఆ తర్వాత ఆమె ఆత్మకూరు వెళ్లవలసింది; కాని, వడదెబ్బ తగలడంతో డీఆర్ ఉత్తమ హోటల్‌లో సేదతీరి, మద్రాసు వెళ్లి పోయింది.


నటుడు మురళీమోహన్ ఆత్మకూరు నియోజక వర్గంలో పర్యటించాడు. చాలా గ్రామాలలో సభలు పెట్టి, మాట్లాడాడు. అయితే ఒకటి రెండు దగ్గర్ల ఆయనకు జనం నుంచి చేదు అనుభవాలు ఎదురైనాయి. చేజర్లలో జనం నిరసన తట్టుకోలేక సభ రద్దు చేసుకుని వెళ్లి పోయాడు.

నటి విజయశాంతి 22తేది వస్తున్నారు. ఆ రోజంతా ఆత్మకూరు నియోజక వర్గంలో విస్తృత పర్యటన చేయబోతున్నారు.


నటుడు సుమన్ 19తేది ఎఎస్ పేటలో ఒక రోడ్‌షో నిర్వహించాడు. రాత్రికి నెల్లూరు వీధులలో తిరగబోతున్నారు.

తరువాయి 14వపేజీలో

# మంచికి ప్రజా పట్టాభిషేకం



శ్రీమతి సోనియాగాంధీ | శ్రీ నేదురుమల్లి జనార్దనరెడ్డి | డా॥ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి | శ్రీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి | శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి



పదవులున్నా లేకున్నా
ప్రజలతోనే వున్నవాడు
రైతన్న సమస్యలపై
పోరాటం చేసినవాడు
ఉదయగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధి స్వాప్నికుడు
మనవాడు - మనందరి వాడు

**శ్రీ మేకపాటి చంద్రశేఖరరెడ్డి గారి**

విజయం - మంచికి ప్రజా పట్టాభిషేకం

**హస్తం గుర్తుకే మన ఓటు**

పోలింగ్ తేది : 26-04-2004

... ఉదయగిరి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు

Space donated by Dist. Congress Committee, Nellore

# ఎవరు అందుబాటన్నదే చర్చ!

వెంకటగిరిలో పోలింగ్‌కు ఒక వారం ముందే పరిస్థితి స్పష్టంగా కనపడి పోతున్నది; ఓటరు మనోభావాలు వూహించిన దానికంటే ముందుగా బయటపడి పోతున్నాయి. రాష్ట్రంలో ప్రచండంగా వీయనున్న తెలుగుదేశం వ్యతిరేక ప్రభంజనం సుస్పష్టంగా కన్పడుతున్న నియోజక వర్గాలలో వెంకటగిరి మొదటిదని చెప్పవచ్చు.

దానికి తగినట్లు ఆ పార్టీ అభ్యర్థి కూడా. రాజాలను రంగంలో దించి పెద్ద

### వెంకటగిరి పరిస్థితి స్పష్టం

పొరపాటు చేశాడు చంద్రబాబు. కాల దోషం పట్టిన మనుషులు వారు; కాలం చెల్లిన పద్ధతులు వీడలేని చాంధసులు. ఇప్పటి ఎన్నికలకు అవసరమైన లక్షణా లేవీ లేవు వారి దగ్గర. జనం కూడా వారిని నమ్మలేని పరిస్థితి. తమ ఎమ్మెల్యే తమకు మున్నూట అరవై రోజులూ అందుబాటులో వుండాలనే కోరిక - ఓటరుది. రాజాల విషయంలో అది అసాధ్యం. వారు రాజ సౌథం నుంచి బయటకు రారు; బయట వారిని లోపలకు రానివ్వరు. వారు ఇష్టపడినప్పుడు మాత్రమే ఇష్టపడినంత సేపు మాత్రమే ప్రజలతో కలుస్తారు; ప్రజల అవసరం పడినప్పుడు కలవాలంటే కుదరదు. ఈ పద్ధతి ఇప్పుడు ఎవరికి నచ్చుతుంది చెప్పండి?

ఏ గ్రామం వెళ్లి పల్లె జనాన్ని కదిలించినా ఈ మాట విన్పడుతున్నది. అసలే ప్రభుత్వ వ్యతిరేకత గాలి; ఆపై ఈ అనుమానం; అందువల్ల ఓటర్లు బహిరంగంగానే చర్చ జరుపుతున్నారు.

రాజ్యలక్ష్మమ్మ పద్ధతి ఇందుకు విరుద్ధం. ఆమె అందరికీ అందుబాటులోని మనిషి. వెంకటగిరిలో వుంటేనే కాదు; హైదరాబాదులో వున్నప్పుడు కూడా ఆమె జనానికి చేరువలో వుంటుంది. ఏ సమయంలో ఫోన్ చేసినా పలికే అతి కొద్దిమంది రాజకీయవాదులలో ఆమె ఒకరు. మౌలికంగా వీరిద్దరి మధ్య వున్న తేడాయే ఇప్పుడు నియోజక వర్గంలో ప్రధానంగా చర్చలో వుంది.

మండలాల వారీగా చూసినా కాంగ్రెస్‌పైచేయి స్పష్టం. బాలాయపల్లి, నాయుడుపేట మండలాలలో కాంగ్రెస్; డక్కిలిలో తెలుగుదేశం; ఓజిలి మండలం, వెంకటగిరి టౌన్‌లలో చెరి సమానంగా వుంది పరిస్థితి. డక్కిలిలో పుల్లారెడ్డి గారు మౌనంగా వున్నారు. జనార్ధనరెడ్డి గారు వెంకటగిరికి రాగానే ఆయన మౌనవ్రతం మానవచ్చని అంచనా. అదే జరిగితే డక్కిలి మండలంలో కూడా కాంగ్రెస్ మెజారిటీ సాధిస్తుంది.



అల్లూరు విష్ణు నుదుట విజయ తిలకం దిద్దుతున్న మహిళాభిమాని.

# త్రాసు మొగ్గెటో తేలిపోయింది!

రాపూరు రాజకీయ పరిస్థితులలో గత వారానికి ఇప్పటికి పెద్ద తేడా లేదు. తెలుగుదేశం అభ్యర్థి ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి పట్ల వ్యక్తిగతంగా వ్యతిరేకతతో కమ్మ కులస్తులందరూ కాంగ్రెస్ పక్షంగా పని చేస్తారన్న అభిప్రాయం మాత్రం నిజం కాలేదు. రాపూరు, వెంకటాచలం మండలాలలో ఆ మార్పు గోచరించడం లేదు. అయితే పొదలకూరు, చేజర్ల, కలువాయి ప్రాంతాలలో కొమ్మి లక్ష్మయ్య నాయుడు ప్రభావం వల్ల ఆ వర్గాలలో తెలుగుదేశం వ్యతిరేకత కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నది. గత ఎన్నికల్లో కమ్యూనిస్టు ఓట్లు కాంగ్రెస్‌ను పరోక్షంగా గెలిపించాయి. సిపిఐ నేత దశరథరామయ్య పోటీలో వుండడం వల్ల, తెలుగుదేశం ఓట్లు చీలి కాంగ్రెస్ లాభ పడింది. ఈసారి వారి ఓట్లు కాంగ్రెస్‌కు ప్రత్యక్ష ప్రయోజనం సమకూరుస్తున్నాయి. నెల్లూరుటౌన్ ప్రాంతంలోని సిపిఎం సానుభూతిపరులు, ములుముడి ఫిర్కాలోని సిపిఐ ఓటర్లు కూడా ఆనం రామనారాయణ రెడ్డిని ఆదరిస్తున్నారు. ఉభయ కమ్యూనిస్టు నేతలు అరమరికలు లేకుండా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించడంతో రామనారాయణ పని సులువై పోయింది.

గత వారం చెప్పినట్లు - రైతాంగంలో తెలుగుదేశం వ్యతిరేకత వుధృతంగా వుంది. అది రోజు రోజుకూ పెరుగుతున్నదే తప్ప తరగడం లేదు. ఎల్లసిరికి నేరుగా అనుభవంలోకి వస్తున్నది కూడా. సాంప్రదాయకంగా ఆయన్ను సమర్థించే గ్రామాలలో కూడా రైతులు ఈసారి మమ్మల్ని వదిలెయ్యమని అడుగుతున్నారు.

వైఎస్ఆర్‌కు ఎదురౌతున్న మరొక లోపం - నాయకులలో చిత్తశుద్ధి లేకపోవడం. మండల స్థాయిలో కాని, గ్రామ స్థాయిలో కాని పైపై మాటలు తప్ప గట్టిగా పని చేసి గెల్పించాలన్న తపన కనపడడం లేదు. ఒక రకంగా ఒంటరి వాడై పోయాడు - వైఎస్ఆర్. జిల్లా స్థాయిలో కూడా ఆయనకు మద్దతు రావడం లేదు. ఆ మాటకొస్తే జిల్లాలోని అందరు తెలుగుదేశం అభ్యర్థుల పరిస్థితి అంతే. జిల్లా స్థాయిలో నాయకత్వం లేని కొరత వారిని బాధిస్తున్నది. మంత్రి వుంటే సర్వేపల్లి దాటి వచ్చే పరిస్థితిలో లేదు. ఆయన బాధలు ఆయనకు వున్నాయి. ప్రక్కనే వున్న ఆత్మకూరుకు ఎక్కడెక్కడి సినిమా తారలు, వెంకయ్య నాయుడు వంటి నేతలు వరసబెట్టి వస్తున్నారు కాని - రాపూరులో ఒక్కరూ అడుగు పెట్టడం లేదు. రేపు 22తేది చంద్రబాబు అయినా రాపూరు వస్తారో లేదో తెలియదు.

### రాపూరు రాజకీయం

రామనారాయణ మాత్రం వైఎస్ రాజశేఖరరెడ్డి పర్యటనను బాగా వుపయోగ పెట్టుకున్నాడు. మరొక ప్రక్క గులాం నబీ ఆజాద్‌ను కూడా రప్పించి ముస్లిం ఓటర్లను సంతృప్తి పరచనున్నారు. సోనియా గాంధీ పర్యటన కూడా ఆయనకు అనుకూలమే.

అటు కొమ్మి అనుచరుల అనూహిత మద్దతు, ఇటు కమ్యూనిస్టుల సహకారం రామనారాయణరెడ్డిలో ఆత్మ విశ్వాసాన్ని విపరీతంగా పెంచుతున్నాయి. గత ఏ ఎన్నికలలోనూ లేనంత ధైర్యంగా వున్నారాయన.

గెలుపు, ఓటముల త్రాసులో ఇప్పటికిప్పుడు చూస్తే మొగ్గు రామ నారాయణ రెడ్డికే కన్పడుతున్నది. పోలింగ్‌కు ఇంకా వారం రోజుల వ్యవధి వుంది కాబట్టి ఈ లోపల ఏదైనా విచిత్ర మార్పులు జరిగితే తప్ప ఫలితం అదిగానే వుండబోతుంది.

# కుప్పాలలో కూడా ఎంతో మార్పు!

సూళ్లూరుపేటలో తమ విజయం పట్ల ఎంతో నమ్మకంతో వున్నారు - తెలుగుదేశం నేతలు; అభ్యర్థి పరసారత్నం సైతం నేను గెలవకుండా ఎక్కడకు పోతాను అన్న ధీమాలో వున్నారు. వారి ఆత్మ విశ్వాసానికి కారణం - కాంగ్రెస్ అభ్యర్థి నెలవల సుబ్రహ్మణ్యం దగ్గర చాలినంత డబ్బు లేక పోవడం. అయితే అది వారి దురాశ మాత్రమే. నెలవల సుబ్రహ్మణ్యం దగ్గర డబ్బులేని మాట నిజమే. కాని వాకాటి నారాయణరెడ్డి ఆ లోపం కనపడకుండా తంటాలు పడుతున్నాడు. తన స్వంత ఎన్నిక మాదిరే చూస్తున్నాడాయన. ఎన్నికలకు డబ్బు అవసరమే కాని - అదొక్కటే ఎన్నికలలో గెలుపు ఓటములను నిర్ణయించగలదనుకోవడం భ్రమ. నోటు తీసుకున్న వారంతా ఓటు వేయరని గతంలో పలుసార్లు నిరూపితమైంది.

### సూళ్లూరుపేటలో పరసా నమ్మకం

అభ్యర్థిగా పరసారత్నం మంచి వాడే; ప్రజలలో పేరున్న వాడే. కాని వరసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై వుండడంతో ఓటర్లకు ముఖం మొత్తి పోయింది. వారు కొత్తదనం కోరుకుంటున్నారు. మరొక ప్రక్క తెలుగుదేశం వ్యతిరేక పవనాలు వుండనే వున్నాయి. ఎప్పుడూ లేనిది ఈసారి జాలర్ల కుప్పాలలో కూడా ప్రభుత్వ వ్యతిరేకత వ్యక్తమౌతున్నది. 1982 నుంచి సాంప్రదాయకంగా తెలుగుదేశాన్ని బలపరిచే ప్రాంతాలివి. వారికి పెద్దగా రాజకీయాలు పట్టవు. వారిపై ఆంధ్ర కంటే తమిళనాడు ప్రభావమే అధికం. దారి డొంకలు కూడా లేని వూళ్లు. కొన్ని కుప్పాలకు ఈనాటికి కూడా పడవలో వెళ్ల వలసిందే. జనార్దన రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వుండగా సాహసించి, పక్షుల రక్షిత చట్టాన్ని ప్రక్కన పెట్టించి, కరెంట్ వేశాడు కాబట్టి సరిపోయింది కాని - లేకుంటే ఆ కుప్పాలు ఈనాటికి కూడా కారు చీకటిలో మ్రగ్గిపోయి వుండేవి. అతిపెద్ద తెలుగు దేశం ఓటు బ్యాంకుగా వున్న ఆ కుప్పాలలో మార్పు ఆ పార్టీ అదృష్టాన్ని తారుమారు చేయనున్నది.

సూళ్లూరుపేట మండలంలో మాత్రం వేనాటి చంద్రారెడ్డి చలవ వల్ల తెలుగు దేశం పటిష్టంగా వుంది. మామూలు కంటె అధిక చిత్తశుద్ధితో పని చేస్తున్నాడు చంద్రయ్య. నాయుడుపేటలో కాంగ్రెస్ బలంగా వుంది. దొరవారిసత్రం చెరి సమానం. చిట్టమూరు మండలం కొంత మేర తెలుగుదేశానికే మొగ్గు.

కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే పసల పెంచలయ్య బహిరంగంగానే నెలవల అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ, ప్రచారం చేస్తున్నాడు. ఎమ్పీకి మాత్రం కాంగ్రెస్‌కు వేయండి, ఎమ్మెల్యేగా సైకిల్‌పై గుద్దండి అని కోరుతున్నారాయన. అయితే ఆయన మాట విన్పించుకునేది ఎవరు?

నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారు రెండు రోజులలో సూళ్లూరుపేట రానున్నారు. ఆయన రాకతో నెలవల వనరుల లోపం కొంతలో కొంత సమసి పోవచ్చు.

# మాదాలెంత పెరిగినా పార్వతమ్మ తరగడం లేదు!

కావలి అసెంబ్లీ అభ్యర్థిగా మాదాల జానకిరాం నామినేషన్ వేసే నాటికి - అనాథ క్రింద లెక్క. ఆయనకు నియోజక వర్గం కొత్త. స్థానిక నేతలెవరూ దగ్గరకు కూడా రాలేదు. అంతా అయోమయం. అటు ప్రక్క చూస్తే మాగుంట పార్వతమ్మ తనకు ప్రత్యర్థి. కాంగ్రెస్ వ్యవస్థ, మాగుంట కుటుంబ అనుచరులతో పాటు ఆమెకు వ్యక్తిగతంగా కూడా పేరు ప్రతిష్టలు వున్నాయి. యముడికి శివుడికి కూడా జంకని తత్వం కల్గిన కలికి యానాదిరెడ్డిని వారు ఒకే ఒక్క రోజులో సంతృప్తి పరచి కాంగ్రెస్ జెండా భుజాన పెట్టారు. ఇంతటి అయోమయ పరిస్థితులను ఒకే ఒక్క వారం రోజులలో చక్కదిద్దుకున్నారు మాదాల జానకిరాం. రాజకీయాలలో సీనియారిటీ, అనుభవం, నాయకత్వ పటిమలు ఎంతగా వుపయోగ పడతాయో జానకిరాంను చూసి అర్థం చేసుకోవచ్చు.

### రెంటికీ చెడిన రేవడి వంటేరు

మొదటి వారం రోజుల పాటు తెలుగుదేశం ప్రచారమంతా కేవలం బయట నుంచి వచ్చిన కార్యకర్తలతోనే జరిగింది. ఇప్పుడా పరిస్థితి లేదు. వంటేరు వేణుగోపాలరెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నప్పటికీ ఇటు టౌన్‌లో అటు పల్లెలలో కూడా తెలుగుదేశం వాదులను గుర్తించి, ముగ్గులోకి దింపగలిగాడాయన. వంటేరు వేణుగోపాలరెడ్డి రెండింటికి చెడిన రేవడి అయ్యాడు. రామకోటారెడ్డి ఇందు కాయనకు బాగా వుపయోగ పడ్డాడు. ప్రచార వనరుల విషయంలో మాగుంటను మించిపోయాడు జానకిరాం. దానితో ఒక్క సారిగా మార్పు వచ్చినట్లు భ్రమ కల్గుతున్నది. తెలుగుదేశం మంచి వూపు మీద వున్నదటనే అని అడిగే వారు ఎక్కువైనారు.

అయితే ఇవన్నీ తెలుగుదేశం పోటీలో వుంది అని కన్పింప చేయడానికి మాత్రమే వుపయోగపడుతాయనడం నిజం. కాంగ్రెస్ ధాటికి నిలువగలిగే స్థితికి ఈనాటికి కూడా చేరుకోలేదు ఆయన. మామూలుగానే తెలుగు వ్యతిరేక పవనాలు వీచే రోజులివి. దానికి తోడు మాగుంట పార్వతమ్మ స్వంత భరిస్మా; తన పరిస్థితి చూస్తే చెల్లాచెదురైన కొంప నర్దుకోవడానికే సమయం చాలడం లేదు; అందువల్ల జానకిరాం ఎంత పెరిగినట్లు కన్పించినా పార్వతమ్మ మాత్రం తరగడం లేదు. ఆమె ఆధిక్యతను అందుకోవడం కష్టం కావచ్చు.

# ఆడవాళ్ల అండ అందరికీ అలవాటైంది!

కుటుంబ మహిళలను ఎన్నికల ప్రచారంలోకి దింపే ఆనవాయితీ మన జిల్లాలో పెద్దగా లేదు. ఎక్కడో ఒకటి అర అభ్యర్థులు మాత్రమే ఆ ప్రయోగం చేసేవారు. అయితే ఈసారి మాత్రం చాలా నియోజక వర్గాలలో మహిళల



ప్రచార రథంపై మనుమడితో ముసిపాలాడుతున్న మాగుంట పార్వతమ్మ

ప్రచారం విస్తృతంగా జరుగుతున్నది. అందరికంటే ముందు అల్లూరులో బీదా మస్తాన్‌రావు ఈ ప్రయోగం చేశాడు. నామినేషన్ ముందునాటి నుంచే ఆయన సతీమణి ఆయనతో కలిసి విడవకుండా తిరుగుతున్నారు. నెల్లూరులో రమేష్‌రెడ్డి, అనురాధ దంపతులు ఒకరు లేకుండా మరొకరు కనపడడమే లేదు. ఉదయగిరిలో తెలుగుదేశం ఎమ్మెల్యే విజయరామరెడ్డి సతీమణికి ప్రతి ఎన్నికలలోను పాల్గొనడం అలవాటు; ఈసారి ఎండ కూడా లెక్క చేయకుండా ప్రచారం చేస్తున్నదామె. కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖరరెడ్డి కుటుంబ సభ్యులు ఎప్పుడూ లేనిది ఈసారి రంగంలో దిగారు. సర్వేపల్లిలో మంత్రి చంద్రమోహన్‌రెడ్డి తన తరఫున తన భార్యనే కాక, సోదరిని సైతం ఇల్లిల్లూ తిప్పి, ఓట్లు అర్థింప చేస్తున్నారు. రాపూరులో ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి సతీమణి ప్రచారం చేస్తున్నారు. అల్లూరులో కాటంరెడ్డి విష్ణువర్ధనరెడ్డి సతీమణి గత ఎన్నికలలో విస్తృత ప్రచారం చేశారు; కాని ఈసారి ఎందువల్లనో ఆమె ఇంకా బయట పడలేదు. కోవూరులో నల్లపరెడ్డి ప్రసన్న తనకు రాజకీయ ఇబ్బంది వచ్చినప్పుడల్లా తమ తల్లి శ్రీలక్ష్మమ్మ చేత కంటతడి పెట్టించడం ఆనవాయితీ. ఇప్పుడూ అదే పని చేస్తున్నారాయన. పరిస్థితి తీవ్రంగా వుంది కాబట్టి తల్లితో పాటు, తన సతీమణిని, సోదరిని, కుమారుడ్ని కూడా గ్రామాలకు పంపి బ్రతిమలాడిస్తున్నాడు.

కావలిలో మాదాల జానకిరాం తన సతీమణినే కాదు, కుమార్తెను కూడా ప్రచారానికి దింపారు. వారికి తోడుగా తతిమా ఆడవాళ్లు సైతం ప్రజలకు తమ

తరువ 23వ పేజీలో



కోవూరు కాంగ్రెస్ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఏ గ్రామం వెళ్లినా ఈ పూలవర్షం మామూలై పోయింది!

# వార్తలమ్ముతున్న దినపత్రికలు!

క్రింద రెండు బొమ్మలున్నాయి చూడండి. 14తేది వార్త దినపత్రికలో, మొదటి పేజీలో హెడ్డింగ్ వార్తలవి. ఏ పత్రికకైనా తన ఇష్టం వచ్చిన రీతిలో వార్తలు ప్రచురించే స్వేచ్ఛ వుంది.

**ఏమి చేశారని ఓటెయ్యాలి**
రాజా రాజ్యలక్ష్మిలను నిలదీస్తున్న ఓటర్లు

దాన్ని అభ్యంతర పెట్టడానికి ఎవరికీ హక్కు లేదు. పత్రికా స్వేచ్ఛ అని దానినే అంటారు. అందువల్ల ఒక పత్రికలో వచ్చిన వార్తలపై మరొక పత్రిక చర్చ జరపడం మంచి సంప్రదాయం కాదని మాకు తెలుసు. అయితే ఆ నియమం వార్తలకు మాత్రమే వర్తిస్తుంది; వార్తల రూపంలో జరుగుతున్న వ్యాపార ప్రయోగాలకు కాదు. ఇప్పటి దిన పత్రికలో వార్తలు ఏవో; ఆ రూపంతో వచ్చే వ్యాపార ఖండికలు ఏవో కనిపెట్టడం పాఠకుల తరం కావడం లేదు.

పత్రిక నడపడానికి ప్రకటనలు తప్పనిసరి. అవి లేకుండా ఏ పత్రికా మనుగడ సాగించలేదు. కాని ప్రకటనలు సంపాదకీయ విధానాలను ప్రభావితం చేయకూడదు. పాఠకుల శాతం పెరిగే కొద్ది; ఆ పాఠకులలో కొనుగోలు శక్తి కలిగిన వారి శాతం పెరిగే కొద్ది ప్రకటనలు వాటంతట అవి వస్తాయి. పాఠకుల సంఖ్య పెరగాలంటే వార్తలలో విశ్వసనీయత వుండాలి; వ్యాఖ్యలలో నిష్పాక్షికత వుండాలి; పత్రిక మీద పాఠకుడికి నమ్మకం కల్గాలి. పత్రికా రంగ నిర్వ

**ప్రజాబంధు 'బొల్లినేని'**

హణలో పని పిల్లవాడికి కూడా తెలిసిన సూత్రం ఇది. కాని ఇప్పటి దిన పత్రికలు ఈ ధోరణిలో లేవు. వార్తల కంటే ప్రకటనలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సంపాదకుడిని, ఏలే కరిని ప్రక్కన పెట్టి

తరువ 23వ పేజీలో





బొల్లినేనికి ఓటు - శాంతికి చోటు
ఆత్మకూరు నియోజకవర్గంలో
రాజకీయ కక్షల కార్చిచ్చును చల్లార్చిన
శాంతి కాముకుడు.
వర్గపోరాటాల పల్లెల్లో శాంతి సుమాలను
పూయించిన నాయకుడు
ఆత్మకూరుకు ఆత్మబంధువై
పేద ప్రజలకు దయానిధుడైన
'బొల్లినేని కృష్ణయ్య' విజయం
నిస్వార్థనేతకు ప్రజానీరాజనం.
ఆత్మకూరు నియోజక వర్గం తెలుగుదేశం, బి.జె.పి. అభిమానులు
Space Donated by : Nellore Dist. B.J.P.

## కమ్యూనిస్టులు

17వ పేజీ కొరవ

ఎన్నికల పొత్తు ద్వారా ఒక స్థానంలోనైనా పోటీ చేయాలని ప్రయత్నించారు. కాని అందుకు అవకాశం రాలేదు. దానితో వూపిరి నిలుపుకొను వెంకయ్య గారు కోవూరులో పోటీకి దిగారు. అయితే అది నామమాత్ర పోటీ. గత ఎన్నికల కంటె అదనంగా వచ్చే ఓట్లు ఏవీ కన్పించడం లేదు. కనీసం అక్కడ త్రిముఖ పోటీ జరుగుతున్నది అనే అభిప్రాయం కల్పించడంలో కూడా విఫలమౌతున్నారు వారు.

కమ్యూనిస్ట్ పార్టీ, కమ్యూనిస్ట్ ఉద్యమం కనుమరుగై పోయే పరిస్థితి ఏర్పడడం విచాకరం. ఒక్క నెల్లూరులోనే కాదు; రాష్ట్రంలోని చాలా చోట్ల ఇదే పరిస్థితి. కృష్ణ, ఖమ్మం వంటి జిల్లాల లోనూ సిపిఎం అస్తిత్వ సమస్యను ఎదుర్కొంటున్నది. దీనికి కారణం - ప్రపంచ వ్యాప్తంగా తటస్థితున్న సిద్ధాంత పరమైన వైరుధ్యాలు కాదు; చైనా కమ్యూనిస్టులు కాపిటలిస్టులుగా మారడం కూడా కాదు. భారత కమ్యూనిస్టులు చాలా కాలం క్రితమే - వారి భాషలోనే చెప్పాలంటే - బూర్జువా వ్యవస్థకు అనుగుణంగా తమ పార్టీని మలుచుకున్నారు. భారత దేశానికి అనుగుణమైన పద్ధతులలో పేద ప్రజల సంరక్షులుగా వ్యవహరించడం నేర్చుకున్నారు. కార్మికులను, రైతు కూలీలను కూడ కట్టి, ప్రజాస్వామ్య యుతంగానే ప్రజా పోరాటాలు చేసే సంప్రదాయం నెలకొల్పారు. అందువల్ల ఎక్కడో జరిగే సిద్ధాంత భూకంపాలకు ఇక్కడి పార్టీ పునాదులలో పగుళ్లు వచ్చాయనడం నిజం కాదు. పార్టీ నేతలలో అంకిత భావన లోపించడం; క్రింది స్థాయి కార్యకర్తలు, నేతలపై అదుపు కోల్పోవడం; తమ పార్టీ వారు తప్పులు చేసినప్పుడు మందలించ లేక పోవడం; మారుతున్న కాలానికి అనుగుణంగా మారలేక పోవడం - కమ్యూనిస్టుల పతనానికి కారణాలు. నెల్లూరు జిల్లా వరకు అది పూర్తి నిజం.

కమ్యూనిస్టు పార్టీ అంతరించి పోతే పేదల పక్షాన మాట్లాడే రాజకీయ శక్తి నశించి పోయినట్లు లెక్క. మన రాష్ట్రంలో ఇప్పటికే ఆ సూచనలు, దుష్ప్రభావాలు చూస్తూనే వున్నాము. చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను కూటి నీళ్లకు అమ్మి పారేసి, వేలాది మంది కార్మికులను వీధుల పాటు చేస్తే - కనీస పాటి ప్రతిఘటన కూడా ఇవ్వలేక పోయింది కమ్యూనిస్టు పార్టీ. జవహర్‌లాల్ నెహ్రూ కాని, ఇందిరమ్మ కాని కమ్యూనిస్టుల ప్రతిస్పందన ఎట్లా వుంటుంది అని పరిశీలించనిదే ఏ పాలనా పరమైన నిర్ణయాలు తీసుకునే వారు కాదు. వారి ఆగ్రహానికి గురైతే బ్రతకడం కష్టం అన్న భయం వారిలో వుండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. పైనుంచి క్రింద వరకు అదే దిగజారుడు.

నెల్లూరు వరకు జక్కా వెంకయ్య గారు పదహారణాల కమ్యూనిస్టు. ఆయన చిత్తశుద్ధి, అంకిత భావం, త్యాగ నిరతులు శంకింప రానివి. తన జీవిత కాలంలోనే తాను పెంచి పోషించిన పార్టీ పతనమై పోవడం ఆయనకు ఎట్లా వుందో కాని, ప్రతి కమ్యూనిస్టు అభిమానికీ హృదయావేదన కల్గిస్తున్నది. ఇప్పటికైనా తన తప్పు ఏమిటో ఆత్మ పరిశీలన చేసుకుని; పార్టీలోకి కొత్త రక్తాన్ని ఎక్కించి; తన పర్యవేక్షణలో కొత్త తరాన్ని పెంచి; జిల్లాలో మళ్లీ సిపిఎం జెండా రెపరెపలాడేటట్లు చేస్తేనే - ఆయన జీవితకాలం పాటు పడిన శ్రమకు సార్థకత.

## గట్టెక్కేదెవరు

3వ పేజీ కొరవ

నివసించే వాడలలో బిజెపి కార్యకర్తలు అహోరాత్రులు మకాం పెట్టి, ఇల్లిల్లా తిరిగి ఓట్లను అర్థిస్తున్నారు. ఆనం వారిని ఎదిరించి నిలువగల శక్తి తమకుందని నిరూపించడానికి దొరికిన ప్రతి అవకాశాన్ని వాడుతున్నాడు సురేష్‌రెడ్డి. ప్రచారంలో కూడా వ్యక్తిగత విమర్శలు జోరుగా వినవస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సురేష్‌రెడ్డి తన యావత్ శక్తిని వుపయోగించి పోరాడుతున్నాడు.

వివేకా కూడా ఎంత మాత్రం తీసిపోవడం లేదు. కాంగ్రెస్ నుంచి వెళ్లిన వారికంటె అధికంగా తెలుగుదేశం నుంచి తీసుక వచ్చాడు. బాలాజీనగర్ కౌన్సిలర్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆనం వారి కంట్లో నలుకగా తయారై వున్న సంగతి తెలిసిందే. దానికి విరుగుడుగా శీనయ్య సోదరుడు విజయకుమార్ రెడ్డిని తమ వైపుకు తిప్పుకున్నారు. విజయ ఇటీవల తెరమరుగైనాడు కాని, గతంలో మర్రి చెన్నారెడ్డి గారి శిష్యుడిగా జిల్లా స్థాయిలో రాజకీయం చేసిన వాడే. టౌన్‌లో కూడా విస్తృతమైన పరిచయాలు వున్నాయి. వాటికి పట్టిన కాలదోషాన్ని తొలగించే పనిలో నిమగ్నమై వున్నాడు. తెలుగుదేశం మాజీ కౌన్సిలర్లు సంక్రాంతి కళ్యాణ్, నవమణి; పిల్లల శ్రీనివాసులు, అంకం రాఘవరెడ్డి వంటి ఇతర ముఖ్యులను తన ప్రచారంలోకి దింపాడు వివేకా. టూటౌన్ ఏరియాలో కాంగ్రెస్ బలం



నెల్లూరులో బిజెపి అభ్యర్థులు సురేష్‌రెడ్డి, బాలకొండయ్యలు రమేష్‌రెడ్డితో కలిసి నిర్వహిస్తున్న రోడ్ షో.

తక్కువ అనే పేరు వుండేది ఇప్పటి వరకు; వీరందరితో ఆ లోపం సవరింపబడుతుందని ఆయన అంచనా. టౌన్‌లోని కాంగ్రెస్ యంత్రాంగం యావత్తూ వివేకా అదుపులోనే వుంది; దాన్ని సంపూర్ణంగా వుపయోగ పెట్టుకుంటున్నాడు. బిజెపి ఎత్తులు ఎట్లా వుంటాయో, వాటికి విరుగుడు మంత్రాలేమిటో వివేకాకు బాగా తెలుసు. సందాని బాషా ఒక్కడు లేని లోపాన్ని, మొత్తం జెండావీధి యువకులందరి సమీకరణ ద్వారా పూడ్చుకుంటున్నాడు. టౌన్‌లోని వివిధ ప్రాంతాలలో వున్న ముస్లిం ఓటర్లందరినీ మంచి చేసుకోవడం ఆయన వ్యూహంలో ఒక కీలక భాగంగా కనిపిస్తున్నది.

వివేకానందరెడ్డి మీద వ్యక్తిగత వ్యతిరేకత తమకు అనుకూలిస్తుందని బిజెపి భావన. ఎమ్మెల్యేగా ఏమీ చేయలేదన్న అసంతృప్తితో జనం వున్నారని; వారంతా తమకే ఓట్లు వేస్తారని వారి ఆశ. చంద్రబాబు మీద, తెలుగుదేశం ప్రభుత్వం మీద వున్న అయిష్టత తనకు ఓట్ల వరద కురిపిస్తుందని వివేకానందరెడ్డి ధీమా. మొత్తం మీద నెల్లూరు ఎన్నిక మహారంజుగా వుండబోతుంది. తుది ఫలితం ఎట్లా వుంటుంది అని అడిగితే మాత్రం - వేచి చూడమన్నదే మా సమాధానం.

## సోనియా

9వ పేజీ కొరవ

### చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహుశా 22తేది నెల్లూరు జిల్లా పర్యటనకు రావచ్చని అనధికార వర్తమానం. నాలుగైదు చోట్ల సభలు వున్నాయట.

### వెంకయ్యనాయుడు

బిజెపి జాతీయ అధ్యక్షుడు వెంకయ్యనాయుడు ఈ రోజు (19తేది) గూడూరు వచ్చారు. అక్కడొక సభ. తర్వాత చిట్టగుంట, కావలి వెళ్తారు.

### గులామ్‌నబీ ఆజాద్

కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌ఛార్జి గులాంనబీ ఆజాద్ రేపు(20తేది) నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. మద్రాసు మీదుగా వస్తున్నారాయన. రేపు రాత్రికి నెల్లూరులోనే మకాం పెట్ట బోతున్నారు.

### దాసరి

దర్శక రత్న దాసరి నారాయణరావు - జిల్లా కాంగ్రెస్ నేతలెవరితోనూ సంబంధం లేకుండా తిరుపతి లోక్‌సభ అభ్యర్థి చింతామోహన్ పిలుపుపై నాయుడుపేట, వెంకటగిరి, బాలాయపల్లి, ఓజిలి, ఆర్మేనిపాడు, జయంపు తదితర చోట్ల సభలలో పాల్గొన్నారు. రెండు చోట్లా కనీసం అసెంబ్లీ అభ్యర్థులకు సమాచారం కూడా ఇవ్వలేదట. దానితో ఏర్పాట్లు సక్రమంగా జరగలేదు.

## కులాల ఉచ్చు

8వ పేజీ కొరవ

ఫలితం వూహకు అందుతుంది.

అయితే మరొక ముఖ్య అంశం కొత్తగా తలెత్తుతున్నది. బీదా మస్తాన్ రావు బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి కావడంతో, ఆయన గెలుపు సమ్మతం కాని అగ్రవర్ణాల వారు పార్టీలకతీతంగా ఏకం అవుతున్నారన్న వదంతి ఒకటి వ్యాపిస్తున్నది. అదే నిజమై, దానికి ప్రచారం జరిగితే బలహీన వర్గాల వారు సైతం ఆ దారిలోనే నడవవచ్చు. ఆ రెండు పరిణామాలు మొత్తం రాజకీయ బలాబలాలనే తారుమారు చేసే ప్రమాదం వుంది. అందువల్ల అల్లూరు ఫలితంపై ఇప్పుడే మేమేమీ వ్యాఖ్యానించదలచడం లేదు.

## ఆత్మకూరు ఓటరు

19వ పేజీ కొరవ

అడుగుతుంటే ఓటరు మనస్సు కరిగిపోతున్నది. తెలుగుదేశం కార్యకర్తలు ఆయన్ను నిరాకరించడానికి కారణం చూపలేని పరిస్థితి.

డాక్టరు సుందరరామరెడ్డి గారు పెద్ద మనిషి; ఆయన వల్ల ఉపకారం జరిగినా, జరగక పోయినా ఎవరికి అపకారం వుండదు; కాంగ్రెస్ వాదులందరితో వ్యక్తిగత సంబంధాలున్నాయి; బంధుత్వాలున్నాయి. డాక్టరుగా ఎంతో మంచి పేరు; డబ్బు కోసం పీడించే రకం కాదు. కొన్నివేల మంది పేదలు ఆయన్నుంచి వైద్య సలహాలు పొందుతున్నారు. ఓటరును మొగమాట పెట్టగలడు.

ఈ ముగ్గురిలో తమకు కావలసిన వాడు ఎవడో తేల్చుకోవడం ఆత్మకూరు ఓటరుకు కష్టమైన విషయమే. అందువల్లనే వారు అయోమయంలో పడిపోతున్నారు.


బ్రాహ్మణ వివాహ సంబంధాలకు
సంప్రదించండి
ఫోన్: 0861 - 2316351






అభివృద్ధి ప్రదాతకు చేయూత

కోవూరు నియోజకవర్గానికి కోటీశ్వరులు వస్తుంటారు, పోతుంటారు. నియోజక వర్గంలో మిగిలేది ఒక్క అభివృద్ధి కార్యక్రమాలు మాత్రమే. ఆ అభివృద్ధికి కారకులైన

శ్రీ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి గారిని

మళ్లీ గెలిపిద్దాం. అభివృద్ధి ప్రదాతకు చేయూతనిద్దాం.

రండి! కదలిరండి!!



సైకిల్ గుర్తుకే మన ఓటు
పోలింగ్ తేది : 26-04-2004

ప్రసన్నకు ఓటు - కోవూరు అభివృద్ధికి చోటు



డా॥ పచ్చిపాల మనమోహన్‌రెడ్డి, B.D.S
డెంటిస్ట్



పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి
ఛైర్మన్,
జొన్నవాడ దేవస్థానం పాలకమండలి

# సురేష్‌రెడ్డి గెలుపు - అభివృద్ధికి మలుపు


శ్రీ ఎ.బి. వాజ్‌పాయి


శ్రీ ఎల్.కె. అద్వాని


శ్రీ ఎం.వెంకయ్య నాయుడు


శ్రీ నారా చంద్రబాబు నాయుడు



భారత్ వెలుగుల ప్రదాత
వాజ్‌పాయ్ ఆశీస్సులతో...

స్వర్ణాంధ్ర భాగ్య విధాత
చంద్రబాబు అండదండలతో...

భారతీయ జనత సమర్ధనేత
వెంకయ్య నాయుడు ఆదేశంతో...

తెలుగు దేశం బలపరచిన నెల్లూరు అసెంబ్లీ బిజెపి అభ్యర్థిగా

**సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి** గెలుపు


పట్టణ ప్రగతికి సంచలన మలుపు

**కమలం గుర్తుకే మీ ఓటు**

**పోలింగ్ తేది: 26-04-2004**

Sponsored by Dist. BJP, Nellore

# కొమ్మి విజయం ఆత్మకూరు ప్రజల విజయం




దున్నే వాడిదే భూమి, ప్రజలకు సేవ చేసే వాడే నాయకుడు. అతడే మన కొమ్మి లక్ష్మయ్య నాయుడు నిత్యం ప్రజా సేవలో వుంటూ అలుపెరుగని రాజకీయ జీవి. పార్టీ అతని పని తీరును గుర్తించ లేకపోయినా స్వయంగా రాష్ట్రపతి చేతుల మీదుగా జన్మభూమి అవార్డును అందుకొన్న లక్ష్మయ్య జిల్లా రాజకీయ నాయకులకు కంటిలో నలుసయ్యాడు. ఈ ఎదుగుదలను ఓర్వలేని వారు ఆయనకు ఆత్మకూరు టిక్కెట్ దక్కనీయకుండా చేసి, ఆ పార్టీ నుంచి వెలివేయించి, ఏదో సాధించామను కొంటున్నారు. కాని లక్ష్మయ్యకు పార్టీల జెండా క్రింద పోటీ చేయాల్సిన అవసరం లేదు. నాయకుడు ప్రజల మధ్య నుంచి పుట్టుతాడే కాని పార్టీ జెండాల నుంచి పుట్టడు. లక్ష్మయ్య గెలుపు ప్రజలందరి గెలుపు. అరచేతిని అడ్డు పెట్టి అరుణోదయాన్ని ఆపలేరు. అన్ని పార్టీల నాయకులు కలసి కుట్రలు పన్నినా లక్ష్మయ్య గెలుపును ఆపలేరు.

ఆత్మకూరు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయుచున్న

**కొమ్మి లక్ష్మయ్య నాయుడు** గారి

విమానం గుర్తుపై మీ పవిత్రమైన ఓటు ముద్ర వేసి గెలిపించ ప్రార్థన.



**పోలింగ్ తేది 26-4-04**


దర్శి రవీంద్రబాబు (కుల్లూరు)
ఛైర్మన్, ఆం.ప్ర. స్టూడెంట్స్ & పేరెంట్స్ వెల్ఫేర్ ట్రస్ట్, చెన్నై

# లక్షన్నా మేమున్నాం నీ వెంట - మీ గెలుపే మా పంట

## ఎమ్మీ అభ్యర్థులు

21వ పేజీ తరువాయి

ఈ పరిణామం కాంగ్రెస్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి గారికి మహదానందం కల్గించే విషయం. ఈసారి ఎట్లయినా ఎమ్పీగా లోకసభకు వెళ్లాలని మహా పట్టుదలతో వున్నారాయన. అందు కోసమే ఎమ్మెల్యే అభ్యర్థులను తన ఇష్ట ప్రకారం ఎంపిక చేయాలని మంకు పట్టు పట్టి, కాంగ్రెస్ నేతలను వుతుకాడించాడు. ఒకటికి రెండుసార్లు అలుక పాన్పు ఎక్కి ఉద్రిక్తత సృష్టించాడు. అనుకున్నది సాధించాడు. విజయం కూడా అట్లనే సిద్ధిస్తుందని చెప్పగల్గిన స్థానం ఇది.

### వెంకటగిరి

| గ్రామం పేరు | టిడిపి | కాంగ్రెస్ |
|---|---|---|
| పాలెం కోట | 727 | 451 |
| పరవోలు | 604 | 914 |
| బంగాలపల్లి | 454 | 680 |
| పాపమాంబ పురం | 779 | 619 |
| వెంకటగిరి - I | 1290 | 818 |
| వెంకటగిరి - II | | 1044 |
| వెంకటగిరి - III | 943 | 969 |
| వెంకటగిరి - IV | 824 | 925 |
| వెంకటగిరి - V | 929 | 459 |
| వెంకటగిరి - VI | 1184 | 1084 |
| సోమసాని గుంట | 1206 | 974 |
| చేవిరెడ్డి పల్లి | 789 | 670 |
| పెరియవరం | 1158 | 843 |
| అమ్మవారిపేట | 819 | 996 |
| బంగారుపేట | 1059 | 1091 |
| పెట్లూరు | 854 | 912 |
| వల్లివేడు | 565 | 926 |
| కలవలపూడి | 1027 | 1077 |
| అలిమెలి | 873 | 941 |
| బాలాయపల్లి | 893 | 1077 |
| వెంగమాంబపురం | 793 | 1132 |
| మన్నూరు | 843 | 1047 |
| జయంపు | 704 | 1039 |
| పిగిలాం | 1164 | 1005 |
| నిడిగల్లు | 1001 | 1023 |
| చిలమానూరు | 1057 | 856 |
| పెరిమిడి | 920 | 851 |
| దేవులపల్లి | 754 | 833 |
| వెంబలూరు | 876 | 1108 |
| డక్కిలి | 1030 | 958 |
| ఆల్తూరుపాడు | 1133 | 881 |
| నాగవోలు | 1299 | 1211 |
| మోపూరు | 796 | 813 |
| లింగసముద్రం | 1497 | 680 |
| వెలికల్లు | 1608 | 917 |
| దగ్గవోలు | 751 | 865 |
| ఇనుగుంట | 909 | 974 |
| అత్తివరం | 952 | 806 |
| గ్రద్దగుంట | 1194 | 960 |
| సగ్గుటూరు | 1014 | 766 |
| చిలమానుచేను | 1411 | 1121 |
| ఆర్మేనిపాడు | 1076 | 690 |
| ఓజిలి | 879 | 780 |
| మానమాల | 684 | 373 |
| కురుగొండ | 802 | 1053 |
| కేశవరం | 982 | 831 |
| శ్రీపురం | 813 | 887 |
| మీనకూరు | 1244 | 878 |
| భీమవరం | 789 | 989 |
| కలిపేడు | | 128 |
| కాపులూరు | 1090 | 1136 |
| తురిమెర్ల | 527 | 756 |
| గిద్దలూరు | 1312 | 1255 |
| ఊటుకూరు | 783 | 919 |
| సైదాపురం | 577 | 1684 |
| రామసాగరం | 525 | 634 |
| మర్లపూడి | 1044 | 1174 |
| తుమ్మలతలుపూరు | 978 | 691 |
| పాలూరు | 702 | 709 |

### కోవూరు

| గ్రామం పేరు | టిడిపి | కాంగ్రెస్ | బిజెపి | సిపిఎం | గ్రామం పేరు | టిడిపి | కాంగ్రెస్ | బిజెపి | సిపిఎం |
|---|---|---|---|---|---|---|---|---|---|
| పాటూరు-1 | 688 | | | 438 | నార్తురాజుపాళెం | 905 | 1578 | | |
| పాటూరు-2 | 501 | 540 | | | రామన్నపాళెం | 712 | 972 | | |
| గంగవరం | 468 | 664 | | | కొడవలూరు | 990 | 663 | | |
| పోతిరెడ్డిపాళెం | 1329 | 776 | | | దామేగుంట | 1250 | | | 798 |
| పడుగుపాడు-1 | 458 | 567 | | | పారపల్లి | 749 | 753 | | |
| పడుగుపాడు-2 | 713 | 522 | | | చౌకచర్ల | 561 | | | 591 |
| పడుగుపాడు-3 | 708 | 1000 | | | విడవలూరు-1 | 959 | 717 | | |
| కోవూరు-2 | 629 | 480 | | | విడవలూరు-2 | 806 | | | 841 |
| కోవూరు-1 | | 636 | 841 | | ముదివర్తి | 1203 | 420 | | |
| కోవూరు-3 | | | 699 | 539 | అన్నారెడ్డిపాళెం | 1010 | | | 1104 |
| కోవూరు-4 | 493 | 463 | | | వావిళ్ల | 1071 | 1256 | | |
| కోవూరు-5 | 891 | | | 741 | వరిణి | 760 | 722 | | |
| కోవూరు-6 | 503 | 883 | | | రామతీర్థం | 573 | 940 | | |
| కోవూరు-7 | 521 | 420 | | | ఊటుకూరు-1 | 1166 | 335 | | |
| ఇనమడుగు-2 | 850 | 936 | | | ఊటుకూరు-2 | 1284 | 558 | | |
| ఇనమడుగు-1 | | | 1017 | 711 | సంగం-2 | 752 | 738 | | |
| లేగుంటపాడు | | 981 | 851 | | సంగం-1 | | 811 | 842 | |
| చెర్లోపాళెం | 585 | 710 | | | తరుణవాయి | 414 | 668 | | |
| వేగూరు | 897 | 1118 | | | పడమటిపాళెం | 715 | 491 | | |
| తలమంచి | 1319 | 948 | | | సిద్దీపురం | 894 | 1049 | | |
| కమ్మపాళెం | 783 | 557 | | | వంగల్లు | 1104 | 804 | | |
| గండవరం | 800 | 977 | | | మర్రిపాడు | 418 | | | 919 |
| దక్షిణ హరిజనవాడ | | 604 | 462 | | దువ్వూరు | 940 | 1327 | | |
| మిక్కిలింపేట | 521 | 314 | | | అన్నారెడ్డిపాళెం | 1706 | 949 | | |

### అల్లూరు

| గ్రామం పేరు | టిడిపి | కాంగ్రెస్ | బిజెపి | సిపిఎం |
|---|---|---|---|---|
| తాళ్ళూరు | 576 | 601 | | |
| జక్కిలపల్లిగూడూరు | 1024 | 1056 | | |
| నాగులవరం | 789 | 772 | | |
| బిట్రగుంట | 962 | 942 | 14 | |
| విశ్వనాధరావుపేట-I | 821 | 665 | | |
| విశ్వనాధరావుపేట-II | 640 | | 503 | |
| బోగోలు-I | 711 | 525 | | |
| బోగోలు-II | 622 | 705 | | |
| బోగోలు-III | 1096 | 620 | | |
| అల్లిమడుగు | 935 | 853 | | 213 |
| ముంగమూరు | 325 | 399 | | 773 |
| సిద్దవరం వెంకటేసుపాళెం | 724 | 999 | | |
| జువ్వలదిన్నె | 891 | 1022 | | |
| చెన్నారాయుని పాళెం | 1202 | 707 | | |
| యల్లాయపాళెం - II | 819 | 923 | | |
| యల్లాయపాళెం - I | | | 793 | 806 |
| వెలుపోడు | 874 | 962 | | |
| దామవరం | 1215 | 1296 | | |
| ఉలవపాళ్ళ | 828 | 1026 | | |
| దగదర్తి | 1101 | 1269 | | |
| చెన్నూరు | 921 | 1343 | | |
| తురిమెర్ల | 1185 | 1096 | | |
| పెదపుత్తేడు | 1305 | 1292 | | |
| కొడవలూరు | 713 | 633 | | |
| సోమవరప్పాడు | 1203 | 766 | | |
| చామదల | 1460 | 1717 | | |
| సింగపేట | 814 | 1027 | | |
| భట్రకాగొల్లు | 626 | 687 | | |
| బీరంగుంట | 714 | 825 | | |
| నార్తుమోపూరు | 1131 | 814 | | |
| ఇందుపూరు | 535 | 556 | | |
| పురిణి | 729 | 635 | | 57 |
| అల్లూరు - I | 581 | 1360 | | |
| అల్లూరు - II | 429 | 1255 | | |
| అల్లూరు - III | 770 | 1133 | | |
| అల్లూరు- IV | 615 | 944 | | |
| అల్లూరు - V | 597 | 733 | | |
| ఇస్కపల్లి - I | 1477 | 1081 | | |
| ఇస్కపల్లి - II | 1899 | 625 | | |
| గోగులపల్లి | 1307 | 952 | | |
| మునులపూడి | | 959 | 1101 | |
| వవ్వేరు | 874 | 729 | | |
| ఇస్కపాళెం - I | 726 | | | 549 |
| నాగమాంబపురం | 915 | 798 | | |
| బుచ్చిరెడ్డిపాళెం - I | 1101 | 990 | | |
| బుచ్చిరెడ్డిపాళెం - II | | 908 | 1011 | |
| బుచ్చిరెడ్డిపాళెం - III | 988 | | | 298 |
| బుచ్చిరెడ్డిపాళెం - IV | | 716 | | 1290 |
| గౌరవరం | 859 | 958 | | |

### రాపూరు

| గ్రామం పేరు | టిడిపి | కాంగ్రెస్ | బిజెపి | సిపిఎం |
|---|---|---|---|---|
| కేశమనేని పల్లి | | 752 | 957 | |
| దాచూరు | 574 | 762 | | |
| నెర్నూరు | 1306 | 1619 | | |
| గోనుపల్లి | 1101 | 1460 | | |
| గుండవోలు | 639 | 1005 | | |
| పెనుబర్తి | 599 | 580 | | |
| పంగిలి | 804 | 844 | | |
| రాపూరు - I | 953 | 1261 | | |
| రాపూరు - II | 1064 | 699 | | |
| రాపూరు - III | 788 | 1020 | | |
| నేలపల్లి | 1183, | 881 | | |
| కంభాలపల్లి | 615 | 853 | | |
| వేపినాపి | 1073 | 925 | | |
| సిద్దవరం | 642 | 704 | | |
| జోరేపల్లి | 1168 | 967 | | |
| గొల్లకందుకూరు | | 462 | 223 | |
| కొత్త వెల్లంటి | | | | 865 |
| కందమూరు | 394 | 620 | | 192 |
| సౌత్ మోపూరు | 487 | 500 | | |
| ఆమంచర్ల | 1443 | 1124 | | |
| ములుమూడి | 782 | 521 | | |
| దేవరపాళెం | 763 | 739 | | |
| అంబాపురం | 758 | 589 | | |
| బుజబుజ నెల్లూరు | 838 | 621 | | 1485 |
| అమ్మవారి పాళెం | 756 | 507 | | |
| తోడేరు | 825 | 1233 | | |
| పొదలకూరు - I | 678 | 712 | | 316 |
| పొదలకూరు - II | 395 | 961 | | |
| పొదలకూరు - III | 589 | 1055 | | |
| మొగళ్లూరు | 1293 | 1459 | | |
| అంకుపల్లి | 1178 | 1084 | | |
| దుగ్గుంట | 1515 | 1657 | | |
| బిరుదవోలు | 945 | 1314 | | |
| కసుమూరు | 1056 | | 1714 | |
| కురిచెర్లపాడు | 486 | 557 | | |
| కనుపూరు - II | 804 | 507 | | |
| కనుపూరు - I | 930 | 563 | | |
| చెముడుగుంట | 945 | 905 | | |
| కలిచేడు | 954 | 910 | | |
| చాగణం | 1115 | 922 | | |
| వీరంపల్లి | 1431 | 1622 | | |
| మడమనూరు | 762 | 736 | | 443 |
| కొమ్మలపూడి | 1504 | 974 | | 31 |
| చెర్లోపాళెం | 1182 | 818 | | 159 |
| మనుబోలు - I | 694 | 1103 | | 18 |
| మనుబోలు - II | 790 | 688 | | 29 |
| పిడూరు | 944 | 1405 | | |
| బద్దెవోలు | 1248 | 1006 | | |
| కొలనకుదురు | 706 | 755 | | |

# కనుమరుగౌతున్న కమ్యూనిస్టులు!

నెల్లూరు జిల్లాకు సంబంధించినంత వరకు ఈ ఎన్నికలలో జరగనున్న ఒక కీలక పరిణామం - కమ్యూనిస్టుల అస్తిత్వానికి ముప్పు ఏర్పడడం. నెల్లూరు రాజకీయాలలో మార్క్సిస్ట్ కమ్యూనిస్టులు మొదటి నుంచి నిర్ణయాత్మక పాత్ర వహిస్తున్నారు. అవిభక్త కమ్యూనిస్టు పార్టీ వున్న రోజులలో వారి బలం జాస్తిగా వుండేది. 1952ఎన్నికలలో వారు పలు నియోజక వర్గాలలో గెలుపుకు దగ్గరగా వచ్చారు. ఆమంచర్ల కృష్ణారావు ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచాడు కూడా. ఒక ప్రక్క కార్మిక ఉద్యమాలు, మరొక ప్రక్క రైతు కూలీ పోరాటాలతో సిపిఎం పార్టీ పేద ప్రజలకు సన్నిహితంగా వుండేది. తర్వాతి రాజకీయ పరిణామాలలో వారి బలం క్షీణించినా - నెల్లూరు, కోవూరు, అల్లూరు నియోజక వర్గాలలో గెలుపు ఓటములను నిర్ణయించే శక్తిగా మాత్రం తమ అస్తిత్వాన్ని నిలుపుకున్నారు. కొన్ని గ్రామాలు వారికి కంచుకోటల వలె వుండేవి. సిపిఎం ఏదైనా ఉద్యమం చేపడితే పాలక పార్టీల గుండెల్లో ప్రకంపనలు పుట్టేవి. జిల్లా అధికార యంత్రాంగం కూడా వారిని చూసి హడలి పోయేది. సిపిఎం కార్యాలయం, రామచంద్రారెడ్డి ఆస్పత్రులు రెండు కూడా పేద ప్రజల దృష్టిలో పవిత్ర ప్రదేశాలుగా గుర్తింపు పడ్డాయి.

అదంతా గత చరిత్ర; వర్తమాన

## నిర్ణయాత్మక పాత్ర నుంచి నామ మాత్ర స్థాయికి పతనం

కాలానికి, దానికి పోలిక లేదు. ఎన్‌టి రామారావుతో, తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్నప్పటి నుంచి జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమం నీరుగారి పోయింది; ప్రజలకు దూరమై పోయింది; ప్రజా ఉద్యమాల నుంచి ప్రక్కకు తొలగి పోయింది; ప్రజా సమస్యలు పట్టించుకోవడం మర్చి పోయింది. నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటు ఉదంతంతో, ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట ఎన్టీఆర్ జరిపిన చరిత్రాత్మక ప్రజా పోరాటం - సిపిఎం, తెలుగుదేశం పార్టీలను సన్నిహితం చేసింది. ఆ ఉద్యమంలో వారి పాత్ర ప్రశంసనీయమైంది. అయితే ఆ సాన్నిహిత్యం తమ పార్టీ మనుగడకు మరణశాసనం అవుతుందని వారు వూహించి వుండరు.

1985 నుంచి వారు తెలుగుదేశం మిత్ర పక్షంగా అవతరించారు. అధికార పార్టీలో అంతర్భాగంగా వ్యవహరించారు. 1998 వరకు ఒక పుష్కర కాలం ఆ పొత్తు అట్లనే కొనసాగింది. మధ్యలో రెండు సార్లు వెంకయ్యా గారు ఎమ్మెల్యేగా గెలిచారు; ఒకసారి ఓడి పోయారు. పాలక పార్టీ మిత్రులుగా వారు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించ లేక పోయారు. ఉద్యమాలు చేపట్టలేక పోయారు. కళాశాలల్లో ఎన్నికలు లేక పోబట్టి కొత్త తరం యువకులను పార్టీలోకి ఆకర్షించే వీలు లేకుండా పోయింది. ఈ సంధి కాలంలో పార్టీలోని కుక్కమూతి పిందెలు పెత్తనానికి వచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారుల తగువులు తీర్చడం, ఇళ్ల స్థలాలు దురాక్రమించడం, భూవివాదాలలో తలదూర్చడం వంటి అపభ్రంశపు పనులన్నీ చేశారు వారు. జక్కా వెంకయ్య ఎన్నికల రాజకీయాలలో తలమునకలు కావడం వీరి ఆటలకు ఆస్కారమైంది. ఫలితం - పార్టీ పట్ల ప్రజలలో చులకన భావం. ప్రజలలోనే కాదు, స్వంత కార్యకర్తలలో కూడా విశ్వాసం నశించింది. క్రమ క్రమంగా కొత్త వారు పార్టీలోకి రావడం మాని వేశారు. మాలకొండయ్య, మస్తాన్ వంటి నిబద్ధత కల్గిన కార్యకర్తలు అంతరించి పోయారు. తాలు తరక మాత్రం మిగిలింది. వారి ఆధిక్యత హెచ్చింది. పార్టీ పట్ల, సిద్ధాంతం పట్ల చిత్తశుద్ధి కల్గిన కొద్దిమంది ఇంకా పార్టీనే కనిపెట్టుకుని వున్నప్పటికీ - వారి మాట చెల్లుబాటు కాని పరిస్థితి.

1985 ఎన్నికలలో అల్లూరులో వెంకయ్య గారు 18,516 ఓట్ల మెజారిటీతో గెలిచాడు; 1994 నాటికి అది 1900 ఓట్లకు క్షీణించింది. 1999లో వారి అభ్యర్థికి ఇదే నియోజక వర్గంలో మొత్తం ఓట్లే - 3325. అంటే రెండు సార్లు పార్టీ సీనియర్ నేత శాసన సభ్యుడిగా పని చేసిన నియోజక వర్గంలో పార్టీ అభివృద్ధి చెందవలసింది పోయి నామమాత్రావశిష్టం అయిందన్న మాట.

కోవూరు పరిస్థితి కూడా అంతే; ఒకప్పుడు అది వారికి దుర్నిరీక్ష్య దుర్గం; కాని 1999లో అక్కడ పార్టీ పోటీ చేస్తే వచ్చిన ఓట్లు కేవలం - 6227. నెల్లూరు టౌన్‌లో కూడా మెల్లమెల్లగా ఇదే పరిస్థితి వచ్చేస్తున్నది. మునిసిపల్ రాజకీయాలలో వారి కౌన్సిలర్లు నిర్వహిస్తున్న పాత్ర అందుకు కారణం.

ఈ ఎన్నికతో ఒక రకంగా సిపిఎం జిల్లా రాజకీయ పటం నుంచే పూర్తిగా అదృశ్యమై పోతున్నది. కాంగ్రెస్‌తో

(శేష 14వపేజీలో)



బస్సులో ప్రయాణీకులను ఓట్ల భిక్ష కోరుతున్న కోవూరు తెలుగుదేశం అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



వాకిట్లో చేరి ఓటు అడిగితే విన్పించుకోవడం లేదని, వంటింట్లోకి దూరి, చేతులు పట్టుకొని ప్రాధేయపడుతున్న రాపూరు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి.

## దుర్గాప్రసాద్‌కు కొత్త డ్యూటీ!

గూడూరు మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ తనకు తానుగా కొత్త డ్యూటీ స్వీకరించాడు. ఆయనకు ఈసారి టిక్కెట్ ఇవ్వని విషయం తెలిసిన సంగతే. దానికి తతిమా నేతల వలె అలకపాన్పు ఎక్కలేదు. పార్టీ విధేయుడిగా హైదరాబాదు పార్టీ కేంద్ర కార్యాలయంలో తిష్ట వేశాడు. అక్కడ చేయడానికి ఏ పనీ లేదు. చూసి చూసి విసుగు పుట్టి, తనకు తానే పని కల్పించుకున్నాడట. చంద్రబాబు గదిలో మూడు కాలింగ్ బెల్స్ వున్నాయి. ఒకటి అటెండర్‌ది; ఒకటి పిఎది; మరొకటి పార్టీ కార్యదర్శిది. ఆ మూడింటి తేడా కనిపెట్టిన దుర్గాప్రసాద్ అటెండర్ బెల్ శబ్దం వినపడగానే గబుక్కున లోపలకు దూరి, టీ తెమ్మంటారా, కాఫీ తెచ్చివ్వమంటారా అని అడుగుతున్నాడట. ఆ విషయం చూసి చంద్రబాబుకు నవ్వు ఆగడం లేదు. టిక్కెట్ ఇవ్వనందుకు అందరి మాదిరి అలిగి, ఆగం చేయకుండా ఈ కొత్త రకం నిరసన తెలుపుతున్న దుర్గాప్రసాద్‌ను భరించడం కష్టంగా వుంది పాపమాయనకు.

## 80కోట్ల మద్యం రెడీగా వుంది

ఎన్నికలలో బ్రాంది, విస్కీలకు విపరీతమైన గిరాకీ వస్తుందని వూహించి బేవరేజెస్ కార్పొరేషన్ వారు ఏకంగా 80కోట్ల రూపాయల విలువైన మద్యం నిల్వ చేశారు అధికారులు. నరసింహకొండ దగ్గరున్న వారి గోడౌన్ పట్టడం లేదు. మార్చి నెలలో 12కోట్ల వరకు అమ్మకాలు జరిగాయట; ఈ నెలలో 15తేది లోపలే ఈ మొత్తం దాటి పోయింది. నెలాఖరులో పోలింగ్ సమయానికి తమ మొత్తం స్టాక్ కరిగి పోతుందని వారి అంచనా.

## గాలివాలు

4వ పేజీ కొరవ

కాదు; సరైన నిర్వహణ లేక పోవడం లోపంగా వుందని కాంగ్రెస్ వాదుల ఆవేదన. దీనితో ప్రభాకరరెడ్డి మండు టెండలో కూడా విరామం లేకుండా తిరుగుతున్నప్పటికీ - ప్రచారంలో వూపు రావడం లేదు. అయితే ప్రభాకర రెడ్డి రాజకీయం తెలియని అమాయకుడేమీ కాదు. చివరి వారంలో ఆయన విశ్వరూపం కన్పింప చేస్తాడని ఒక వూహ.

చంద్రమోహన రెడ్డికి అక్కడక్కడా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. రెండు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తికి ఆ మాత్రం వ్యతిరేకత పుట్టడంలో వింతేమీ లేదు. ఎవరికైనా సహజం అది.

ప్రభాకరరెడ్డి కొత్తవాడు కాబట్టి, ఆ పరిస్థితి లేదు. పైపెచ్చు సివి శేషారెడ్డిని తన దారికి తెచ్చుకోవడంలో ప్రభాకరరెడ్డి రాజకీయ చాణక్యం ఫలించింది. తనకు టిక్కెట్ రానందుకు మండి పడుతుండిన శేషారెడ్డి వున్నట్లుండి చల్లబడి పోయాడు; అంత కోపం తాటాకు మంట వలె చల్లారి పోయింది. ప్రభాకరరెడ్డి ఏ మంత్రం వేశాడో తెలియదు. శేషారెడ్డి అనుచరులకు కూడా సర్దుకోక తప్పని పరిస్థితి. దీనితో పెద్ద చికాకు పోయింది.

ఇద్దరిలో ఎవరు గెలుస్తారు అని ప్రశ్నించడం ఎంత సులువో; సమాధానం చెప్పడం మాత్రం అంత కష్టం. అభ్యర్థులుగా ఇద్దరూ సమవుజ్జీలు. ఎవరికి ఎవరూ ఎందులోను తీసిపోరు. అయితే కొత్త ఒక వింత, పాత అంటే రోత అనే సామెత నమ్మితే - పరిస్థితి ప్రభాకర రెడ్డికి అనుకూలం కావాలి. ప్రభాకరరెడ్డి కొత్త వాడు కాబట్టి వేలెత్తి చూపడానికి ఏదీ లేదు; చంద్రమోహనరెడ్డి పాత వాడు కాబట్టి ఎంత చేసినా ఇంకా చేయలేదనే అసమ్మతి, చేసింది చాల లేదన్న అసంతృప్తి వుండి తీరుతాయి. అయితే చంద్రమోహనరెడ్డికి కొన్ని గ్రామాలలో పాత కావడమే అనుకూలతగా కన్పిస్తున్నది. మొన్నటి కరువు కాలంలో పంటలు ఎండి పోకుండా నీరు పారించాడన్న కృతజ్ఞత కొన్ని గ్రామాలలో కన్పిస్తుంటే; అడిగిన పనల్లా చేశాడు కాబట్టి, ఇప్పుడు కాదు అనడం ఎట్లా అన్న మీమాంస మరికొన్ని గ్రామాలలో కన్పిస్తున్నది. అందువల్ల పాతతో వచ్చే రోత పూర్తిగా పని చేస్తుందని చెప్పలేము.

సర్వేపల్లి గాలి నియోజక వర్గం. రాష్ట్రంలో తోలి రాజకీయ గాలులకు ఇదొక సూచన. ఈసారి ఏ గాలి తోలుతుంది అనే దానిపై ఫలితం ఆధారపడి వుంటుంది తప్ప; అభ్యర్థుల సమర్థతలను బట్టి నిర్ణయం వుండక పోవచ్చు. ఆ గాలి ఏమిటి అన్నది ఇప్పటికే సూచన ప్రాయంగా తెలుస్తున్న మాట నిజం అయినప్పటికీ - పై వారానికి అది మరింత స్పష్టంగా ఒంటికి తగులుతుంది కాబట్టి - అప్పుడు చర్చించుకుందాం.

### పొరపాటుకు క్షమించండి!

గత వారం సర్వేపల్లి రాజకీయ సమీక్ష వార్తలో క్రింది భాగం అచ్చు కాలేదు. కొరవ పేజీలో ఈ పొరపాటు జరిగింది; పాఠకులు క్షమించ కోరుతున్నాము!

-సంపాదకుడు.

## ప్రసన్న

4వ పేజీ కొరవ


చూపుతుందన్న ధైర్యం వంటివన్నీ శీనయ్య అర్హతలుగా కన్పిస్తున్నాయి.

ఈ వూపును పోలింగ్ రోజు వరకు కొనసాగించాలంటే శ్రీనివాసులు రెడ్డి చాలా శ్రమించక తప్పదు. ఇంత వరకు పెట్టిన ఖర్చు, పడిన కష్టం ఒక ఎత్తు; రానున్న వారం రోజులు చేయవలసింది ఒక ఎత్తు. ఈ విషయంలో ఇప్పటికే జాగ్రత్త పడి పోయాడు ప్రసన్న. తన తల్లి, చెల్లి, సతీమణులతో పాటు కుమారుడిని కూడా రంగంలోకి దించి, కన్నీటి వరద సృష్టించి, సానుభూతి పెంచుకోవడానికి సకల సన్నాహాలు చేస్తున్నాడు. మరొక ప్రక్క తమ్ముడు రాజేంద్ర వూరూరా తిరిగి అన్నను గెల్పించమని బ్రతిమలాడుతున్నాడు. కాంగ్రెస్ అభ్యర్థితో పోటీ పడడానికి వీలుగా పెద్ద మొత్తంలో ఎన్నికల నిధి పంపించమని అనంతపురంలో వున్న తమ బంధువులకు వర్తమానం పంపాడట. అవసరమైతే ఓట్లకు నోట్లు పంచి అయినా సరే గెల్చి తీరాలన్నది ఆయన పట్టుదల. ఇప్పుడు తాను ఓడి పోతే నల్లపరెడ్డి కుటుంబం జిల్లా రాజకీయాల నుంచి అదృశ్యమై పోతుందన్న భయం వారందరిలో పట్టుకున్నది. దానితో సర్వం ఒడ్డి పోరాడడానికి సిద్ధపడి పోయారు.

అయితే ఒకసారి వ్యతిరేక పవనాలు వీయడం మొదలైతే డబ్బు, కన్నీళ్లు దానిని ఆపలేవు గతానుభవం కల్గిన వారెవరిని అడిగినా చెప్పే నిజం అది. కోవూరులో ఆ పరిస్థితి వుందా, లేదా అన్నది పై వారానికి అర్థమై తీరుతుంది. అప్పటి వరకు వేచి చూద్దాం.

# మాగుంట విజయం - సుబ్బరామన్నకు నీరాజనం





ప్రజా సేవ కోసం తపించి
ప్రజా సేవలో తరించి
ఆ ప్రజల సేవలోనే తనువు చాలించిన
మహోన్నత వ్యక్తి
**మాగుంట సుబ్బరామన్న**
ఆయన ఆశయాల వారసులుగా
ఆదర్శాలకు ప్రతి రూపాలుగా
నీతి నిజాయితీలకు ప్రతీకలుగా
అభివృద్ధి పథగాములైన

ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి
**శ్రీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి**

కావలి అసెంబ్లీ అభ్యర్థి
**శ్రీమతి మాగుంట పార్వతమ్మ**

విజయం - సుబ్బరామన్నకు ప్రజా నీరాజనం



**హస్తం గుర్తుకే మన ఓటు**

**పోలింగ్ తేది: 26-04-2004**

Space Donated by Ongole DCC

**ఒంగోలు లోక్‌సభ మరియు కావలి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు**

# అయోమయంలో ఆత్మకూరు ఓటరు!

ఆత్మకూరు అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల రాజకీయం రాను రాను సంక్లిష్టంగా తయారౌతున్నది. రోజులు గడిచే కొద్దీ చిక్కు ముడులు పడుతున్నది. నియోజకవర్గంతో సన్నిహిత సంబంధాలు కల్గిన వారికి కూడా ఏమి జరుగుతున్నదో అర్థం కావడం లేదు. జరిగే సంఘటనలు, పరిణామాల వల్ల ఫలితం ఏమిటన్నది వూహకు కూడా అందడం లేదు.



కుల్లూరులో ఇంటింటి ప్రచారం చేస్తూ ఓట్లు అడుగుతున్న ఆత్మకూరు కాంగ్రెస్ అభ్యర్థి బి. సుందరరామిరెడ్డి

చూసే వారికే ఇంత తికమకగా వుంటే, ఆ నియోజక వర్గం ఓటరు పరిస్థితి ఇంకెంత అయోమయంగా వుందో పాపం. నిజంగా ఓటరును చూసి జాలిపడవలసిన పరిస్థితే. వారినింతగా అయోమయంలోకి నెట్టిన వాడు, ఎటూ తేల్చుకోలేని మొగమాటాలకు గురి చేస్తున్న వాడు - బొల్లినేని కృష్ణయ్య గారు. మొన్నటి వరకు ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యే. మధ్యలో తెలుగుదేశం నేతగా కన్పించారు; ఇప్పుడు బిజెపి అభ్యర్థిగా మారారు. ఒక్క వ్యక్తి ఒక్క నెల వ్యవధిలో ఇన్ని పార్టీలను ప్రభావితం చేయడం అరుదైన విషయం. ఆయా పార్టీల అగ్రనేతలందరూ ఆయన ఇష్ట ఇష్టాలకు అనుగుణంగా ప్రవర్తించడం విశేషం. వున్నత స్థాయిలో అందరిని అంతగా మచ్చిక చేసుకున్న తాను, క్రింది స్థాయిలో ఓటరును బుట్టలో వేసుకోలేనా అన్నది కృష్ణయ్య గారి ధీమా. ఆ పోకడ ఫలితమే ఆత్మకూరు రాజకీయం సంక్షుభితం కావడం.

ఆయన టిక్కెట్ - బిజెపిది; కాని ఆయన వెంట బిజెపి, కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీలకు చెందిన నాయకులందరూ నడుస్తున్నారు. పార్టీ తేడాలే లేవు. ఇటు కాంగ్రెస్‌ను, అటు తెలుగుదేశం పార్టీని రెండు ముక్కలుగా చీల్చారాయన. దానితో గ్రామస్థాయి నేతల పంట పండింది. ఆయారాం, గయారాంలు ఎక్కువై పోయారు. ఏ గ్రామ నేత ఏ పార్టీలో వుండాడో, ఎవరిని అనుసరించి పోతున్నాడో తెలియని అయోమయం. కొందరైతే రెండు చోట్లా కన్పిస్తున్నారు.

కొమ్మి లక్ష్మయ్య నాయుడు గారికి తెలుగుదేశం పార్టీలో వున్నప్పుడు పెద్దగా గౌరవం లేదు; చీటికి మాటికి చిరాకు పడి, తిట్ల దండకం ఎత్తుకుంటాడని ఆయన దగ్గరకు వెళ్లడానికి అందరూ సందేహించేవారు. కాని ఆయనకు పార్టీ టిక్కెట్ ఇవ్వక పోయేటప్పటికి ఎక్కడ లేని సానుభూతి పెల్లుబికింది. దాన్ని చూసుకునే ఆయన స్వతంత్రుడిగా పోటీ చేశారు. మొదట మొదట, ఆయన పోటీ వల్ల తెలుగుదేశం ఓట్లు చీలి, కృష్ణయ్య ఇబ్బందుల్లో పడి, కాంగ్రెస్ పని సుకరం అవుతుందన్న అభిప్రాయం వుండింది. సాధారణంగా జరిగేది కూడా అదే. కాని ఇప్పటి పరిస్థితి అది కాదు. టిక్కెట్ రాకున్నా నియోజక వర్గ కార్యకర్తలు ఆయన్ని తెలుగు అభ్యర్థిగానే పరిగణించే వాతావరణం ఏర్పడి వుంది ఇప్పుడు. కృష్ణయ్య అనే గ్రద్ద తన మనుష్యులను ఎగరేసుక పోకుండా, తన పొదుగు క్రింద పిల్లలను దాచుకునే కోడి వలే కాపాడు కుంటున్నారాయన. అభిమానం, సాను భూతి తప్ప ఆయన వద్ద మరే ఆకర్షణ లేక పోవడం విశేషం.

కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సుందర రామిరెడ్డి గారిది మరొక ప్రత్యేక పరిస్థితి. ఆయన ఉభయకుశలోపరి వంటి వాడు. అందరికీ మంచిగా వుండాలనే తత్వం. రాజకీయ శైలి కూడా 1978 నాటిది. ఓటు అడగడానికి, మీటింగుకు పిలవడానికి డబ్బెందుకు ఇవ్వాలనే సత్తెకాలం మనిషి. నలతగా వుందని వచ్చిన వారి చెయ్యి చూసి ఉచితంగా మందు ఇవ్వడానికి సందేహించడు కాని; ప్రచారానికి వచ్చే వారికి మందు సీసా ఇవ్వడానికి మాత్రం సుతరాము ఇష్టపడరు.



అనంతసాగరంలో రోడ్ షో చేస్తున్న ఆత్మకూరు ఇండిపెండెంట్ అభ్యర్థి కొమ్మి లక్ష్మయ్య నాయుడు.

కృష్ణయ్య - ఎమ్మెల్యేగా రైతాంగానికి చాలా ఉపకారాలు చేశారు; తన స్వంత ఖర్చుతో కాలువలు, చెరువులలో పూడిక తీయించాడు; సోమశిల నీళ్లు విడుదల చేయించి పైర్లు కాపాడాడు; పేద జనానికి గుడులు, గోపురాలు కట్టించాడు. పైగా ఎన్నికల నిర్వహణలో చేతికి ఎముకలేని తీరు. ఎవరికి ఏది కావాలంటే అది క్షణాలలో అందుతున్నది. నియోజక వర్గంలో దాదాపు 300 మందికి తన కంపెనీలో ఉద్యోగాలు ఇచ్చి వున్నాడాయన. ఓటుకు నోటు ఇవ్వడానికి సందేహించరు. గ్రామ స్థాయి నేతలకు అన్ని వసరులు సమకూరుస్తున్నాడు. ఆయన వచ్చి ఓటు అడిగితే ఎవరూ లేదు, కాదు అని చెప్పలేని పరిస్థితి.

లక్ష్మయ్య తెలుగుదేశం కార్యకర్తలకు అండగా నిలవడంలో పేరున్న వాడు. కార్యకర్త కోసం ఎంత పెద్ద వాడితోనైనా పేచీ పెట్టుకొనే మనస్తత్వం. పార్టీ నిబద్ధత కూడా తిరుగులేనిది. ఆయన వచ్చి కళ్లనీళ్లు పెట్టుకుని ఓటు

తరువ 14 పేజీలో


## ప్రజల మనిషి - చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించండి

సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రతి పల్లెనూ అభివృద్ధి చేసిన వాడు - ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించేవాడు - రాజకీయ శ్రామికుడు - మనందరి కోసం పని చేసే వాడు!



స్వర్గీయ ఎన్.టి.రామారావు



శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు



ప్రజల మనిషి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని

ఆదరించండి - తెలుగుదేశంను గెలిపించండి

నక్క జిత్తులకు లొంగి పోవద్దు

టక్కరి మాటలకు మోసపోవద్దు

నిజమైన ప్రజా సేవకులను గుర్తించండి

చంద్రమోహన్‌రెడ్డికి అఖండ విజయం చేకూర్చండి.

సైకిల్ గుర్తుకే మన ఓటు

పోలింగ్ తేది : 26-04-2004

...సర్వేపల్లి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు

Space Donated by Nellore Dist. TDP Committee

# 'బీద' ను దీవించండి





కొందరికి రాజకీయం
పదవుల కోసం !
బీద మస్తాన్‌రావుకు
అది ప్రజాసేవ కోసం !
కొందరికి పదవులు
ప్రాభవం కోసం !
బీదమస్తాన్‌రావుకు
అవి పేదల కోసం !!

ఒక మంచి ఆశయం కోసం, ఆదర్శం కోసం
అల్లూరు నియోజక వర్గ తెలుగుదేశంఅభ్యర్థిగా
మన ముందుకొచ్చిన

## 'బీద మస్తాన్‌రావు' ను

దీవించండి. ప్రజాసేవా భాగ్యం కల్పించండి.



పోలింగ్ తేది :
26-4-2004

అల్లూరు నియోజకవర్గం తెలుగుదేశం, బి.జె.పి. అభిమానులు.

Space Donated by : Nellore District T.D.P.

# ఆవు ప్రక్కన దూడలు - ఎమ్పీ అభ్యర్థులు!

అసెంబ్లీ ఎన్నికలతో కలిసి రావడంతో లోక్‌సభ నియోజక వర్గాల విషయం ఎవరూ పట్టించుకోవడం లేదు. నెల్లూరు జిల్లాకు మూడు లోక్‌సభ స్థానాలతో సంబంధం వుంది. మూడింటిలో ముఖ్యమైన వ్యక్తులే పోటీ పడుతున్నారు. కాని వారికి ప్రచారంలో కాని, ప్రసార



అందరూ రోడ్‌షోలు చేస్తుంటే - వెరైటీగా రైల్‌షో ఇచ్చింది పనబాక లక్ష్మి. ఎంతైనా రైల్వే కుటుంబం కదా ఆమెది!

సాధనాలలో కాని ప్రాధాన్యత రావడం లేదు. గుంపులో గోవింద అన్నట్లుంది వారి పరిస్థితి.

నెల్లూరు ఎమ్పీ స్థానం బిజెపికి ఇవ్వడంలో చంద్రబాబు వ్యూహం ఏమిటో తెలియదు. ఆ నిర్ణయంలో రాజకీయ వ్యూహం కంటే - వెంకయ్య నాయుడు గారి మాట కాదనలేని మొగమాటం పాలు ఎక్కువ అయి వుండవచ్చు. రిటైర్డు డిఐజి బాలకొండయ్య గారు చాలా కాలం నుంచి ఈ స్థానం కోసం చకోర పక్షి వలె ఎదురు చూస్తుండినారు. ఆయన పోలీసు వుద్యోగం వదులుకున్నదే అందుకోసం. కాని ఇప్పటికి రెండు ప్రయత్నాలు చేసినా కోరిక తీరలేదు. జిల్లా బిజెపిలోనే కాక, తెలుగుదేశం నేతలతో కూడా ఆయనకు సన్నిహిత సంబంధాలు వున్నాయి. జిల్లా వ్యాప్తంగా దళిత సంఘాలతో మమేకత వుంది.

ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిని పనబాక



గెలుపు తనదేనన్న ధీమాతో చెయ్యి ఎంత ఎత్తుకు ఎత్తాడో చూడండి - మాగుంట శ్రీనివాసులురెడ్డి

లక్ష్మి పాత కాపు క్రింద లెక్క. ఇప్పటికి రెండు సార్లు ఇక్కడ నుంచే ఆమె ఎమ్పీగా గెలిచింది. ఒకసారి ఓడిపోయింది. అందువల్ల నియోజక వర్గం ఆమెకు పుట్టింటితో సమానం. అయితే ఆమెకు ఈసారి టిక్కెట్ సులువుగా రాలేదు. ఏఐసిసి స్థాయిలో పలుకుబడి కల్గిన మాజీ ఐఏఎస్ అధికారి కెడి శీలం ఆమెకు బాగా పుడగాడించారు.

రాష్ట్రంలో చిట్ట చివరగా ప్రకటింపబడిన పేరు ఆమెది కావడంలోనే శీలం ఆమె అభ్యర్థిత్వానికి ఎంతగా బ్రేక్ వేశారో అర్థం చేసుకోవచ్చు. జనార్ధనరెడ్డి గారు చివరి నిముషం వరకు పట్టిన పట్టు వదలకుండా టిక్కెట్ సాధించి పెట్టాడు. ఆయన మీద అటు ఢిల్లీ వర్గాల నుంచి, ఇటు జిల్లాలోని ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి కూడా విపరీతమైన వత్తిడి వచ్చింది. పనబాక లక్ష్మితో మేము వేగలేము అని కొందరు ఎమ్మెల్యే అభ్యర్థులు తెగేసి చెప్పారు కూడా. కాని పేరు వచ్చిన తర్వాత సర్దుకుంటారు లెమ్మని ధైర్యంతో ఆయన ఆ పేరును ఖరారు చేయించారు. ఆయన అనుకున్నట్లే ఏ పేచీ లేకుండా అందరూ ఆమె ప్రచారం తమ భుజాన వేసుకుని పని చేస్తున్నారు.

అయితే ఎమ్పీ అభ్యర్థుల వ్యక్తిత్వాలు, సమర్ధత, పేరు ప్రఖ్యాతుల మీద ఆధార పడి ఎన్నిక జరిగే పరిస్థితి లేదు. అసెంబ్లీ అభ్యర్థుల మీదనే వుంది అందరి దృష్టి. ఇద్దరికీ అదే అనుభవం.

నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాలలో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే ఆ ఎమ్పీ కూడా గెలుస్తారు. అంతకు మించి వేరే లెక్కలు, వ్యూహాలు అవసరం లేదు. అసెంబ్లీ అభ్యర్థికి ఒక రకంగా, ఎమ్పీకి వేరొక రకంగా క్రాస్ ఓటు పరిస్థితి నెల్లూరు వరకు లేదు. కాబట్టి ఆ ఫలితాలే వీన్ని నిర్ణయిస్తాయి.

అయితే తిరుపతి పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధం. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి చింతా మోహన్ పట్ల కాంగ్రెస్ వాదులలోనే సదభిప్రాయం లేదు. గత ఎన్నికలలో కూడా క్రాస్ ఓటింగ్ వల్ల ఓడిపోయిన వాడాయన. ఈసారి కూడా అటువంటి ప్రయత్నమే జరగవచ్చునన్న అనుమానం వుంది. అందుకు కారణం - ఆయన రాజకీయ శైలి. స్థానికంగా ఎవరితోనూ సంబంధాలు పెట్టుకోక పోవడమే కాదు, ఏ స్థానిక కాంగ్రెస్ వాదిని లెక్క కూడా చేయడు చింతా మోహన్. తన దృష్టిలో వారు పిపీలికాలు అన్నట్లు వుంటుంది మాటల తీరు. ఎమ్మెల్యే అభ్యర్థితో కలిసి ప్రచారం చేయడానికి కూడా ఇష్టపడరు. అంతా ఒంటెద్దు పోకడ. ఆయనపట్ల ద్వేష భావాలు నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో సమంగానే వున్నాయి. ఉధృతమైన కాంగ్రెస్ గాలి వీస్తే అవి పని చేయవు; కాని బొటాబొటి మెజారిటీతో ఎమ్మెల్యేగా గెల్చే పరిస్థితి వస్తే మాత్రం - ఒకటి రెండు చోట్ల క్రాస్ ఓటింగ్ జరిగినా ఫలితం వికటిస్తుంది. అందువల్ల ఈసారి ఎమ్మెల్యేలుగా తన అభ్యర్థులను నిలుపుకోవడానికి చాలా ప్రయత్నమే చేశాడు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాలలో విజయం సాధించాడు కూడా. కాని వెంకటగిరి, సూళ్లూరుపేట, పుత్తూరు, నగరి నియోజక వర్గాలలో ఆయన పొడ గిట్టని వారు కాంగ్రెస్ అభ్యర్థులుగా వున్నారు. క్రాస్ ఓటింగ్ ప్రయత్నం చేస్తే తమ గెలుపుకే ముప్పు వస్తుంది అన్న భయం కల్గితే వారు దాని జోలికి వెళ్లరు. ఏ మాత్రం తమ విజయం పట్ల నమ్మకం కల్గినా - చింతామోహన్ కొంప ముంచడానికే చూస్తున్నారన్నది నిజం.

ఈసారి కూడా ఈ స్థానాన్ని బిజెపికి వదిలి పెట్టి చాలా ఉదారత్వం ప్రదర్శించాడు చంద్రబాబు. తన స్వంత జిల్లాలో, తిరుపతి వంటి రాజకీయ ప్రాధాన్యత కల్గిన స్థానాన్ని మిత్ర పక్షాలకు వదలాలంటే ఎంతో పెద్ద మనసు కావాలి. గత ఎన్నికలలో ఎమ్పీగా గెల్చిన వెంకటస్వామి గారే ఈసారి కూడా అభ్యర్థి. ఆయనకు వెన్నుపోట్ల సమస్య లేదు. ఏ వివాదంలోనూ తలదూర్చని

- ★ నెల్లూరులో ఇద్దరిదీ ఒకే పరిస్థితి
- ★ తిరుపతిలో అలివైతే చింతామోహన్‌కు వెన్నుపోటు తథ్యం
- ★ ఒంగోలులో మాగుంట శీనయ్యకు సహకరిస్తున్న దేశం విజయభారతి!

సాధుజీవి ఆయన. బెల్లం కొట్టిన రాయి వలె, ఆవాహన విసర్జన లేకుండా వుండిపోయే వెంకటస్వామి గారికి రెండవ సారి కూడా టిక్కెట్ ఇవ్వడం బిజెపి ఉదారత్వం. ఈ ఎన్నికలో వెంకటస్వామి గారి ప్రమేయం ఇంచుమించూ ఏమీ లేనట్లే. అసెంబ్లీ అభ్యర్థులు గెలిస్తే తాను గెలుస్తాడు; వారు ఓడిపోతే తాను కూడా ఓడిపోతాడు. అంతే.

ఆయన ఎంత వివాద రహితుడో, ఒంగోలు తెలుగుదేశం అభ్యర్థిని శ్రీమతి విజయభారతి అంత వివాదాస్పదురాలు, చంద్రబాబు స్వయంగా ఎంపిక చేసిన అభ్యర్థిని. డ్వాక్రా సంఘాలలో ఆమెకు వుండే ప్రభావాన్ని రాజకీయంగా సొమ్ము చేసుకోవచ్చునని యెంచి ఎంపిక చేశారు. మొత్తం ఏడు స్థానాలలోని తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థులకు ఇష్టం లేని విషయం ఇది. కాని చంద్రబాబు నిర్ణయాన్ని ప్రశ్నించే సాహసం లేక అందరూ నోళ్లు మూసేశారు. కాని ప్రచారంలో మాత్రం ఆమె తీరు వారికి నచ్చాం కావడం లేదు. తమను ప్రక్కకు నెట్టేసి తనంతట తానుగా ప్రచారం చేసుకో చూస్తున్న విజయభారతి పట్ల వారంతా మండిపడుతున్నారు. అలివైతే ఆమెను మళ్లీ డ్వాక్రా సంఘాల సేవకు పంపాలన్నది వారి అంతరంగిక ఉద్దేశం. కొండెపి, కనిగిరి, కందుకూరు నియోజక వర్గాలలో తెలుగుదేశం నేతలు క్రాస్ ఓటింగ్ ద్వారా ఆమెను ఓడించడానికి ప్రయత్నిస్తున్నారని అలజడిగా వుంది.

తరువ 16వపేజీలో


శ్రామికుడికి ఓటు - ప్రగతికి చోటు






స్వర్గీయ ఎన్.టి.రామారావు



శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు

నిరంతర శ్రమజీవి, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో
అలుపెరగని యోధుడు
శ్రీ ప్రసన్న కుమార్‌రెడ్డి గారికి
మన పవిత్రమైన ఓటు ముద్ర వేసి కోవూరు నియోజకవర్గాన్ని
మరో కుప్పంలా అభివృద్ధి చేసుకొందాం.
రండి! కదలిరండి!!



సైకిల్ గుర్తుకే మన ఓటు
పోలింగ్ తేది : 26-04-2004



గుమ్మా సుధాకర్ యాదవ్
తెలుగుదేశం నాయకులు, పెనుబల్లి

# వెంకటగిరికి వన్నె తెచ్చిన
# నాయకురాలి వెన్నంటి నడుద్దాం!





ఇందిరమ్మ నిర్దేశించిన
ప్రగతి మార్గంలో...

రాజీవ్‌గాంధీ ఆదేశించిన
ఆశయాల సాధనలో

సోనియాగాంధీ ఆదర్శంలో
జనార్దనరెడ్డి అడుగుజాడల్లో...

పల్లెల బాగే ఆశయంగా పరితపించే...

ప్రజల మనిషి, శ్రమ జీవి

**నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మను**

వెంకటగిరి ఎమ్మెల్యేగా మళ్లీ గెలిపించుకొందాం
మన సమస్యలన్నీ పరిష్కరించుకొందాం.

చేతి గుర్తుకు ఓటేద్దాం
చరిత్ర సృష్టిద్దాం

పోలింగ్ తేది : 26-04-2004

**వెంకటగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు**

Space donated by Nellore Dist. Congress Committee



కావలి ప్రచార రథంపై తెలుగుదేశం అభ్యర్థులు విజయభారతి, మాదాల జానకిరాం

## దినపత్రికలు

12వ పేజీ కొరవ

- అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్‌ను, యూనిట్ మేనేజర్‌ను పత్రికకు బాధ్యుడిని చేస్తున్నారు. ఒక వార్త రావాలన్నా, రాకూడదన్నా ఈ మేనేజర్లను మంచి చేసుకుంటే చాలు. ఈ పోకడతో ఇప్పటికే దినపత్రికలు భ్రష్టు పట్టి పోయినాయి. ఈ పతనం చాలద న్నట్లు కొత్తగా మరొక ప్రయోగం చేప ట్టాయి - అవి.

ఎన్నికలలో పోటీ చేసే ప్రతి అభ్యర్థి పత్రికకు వారు కోరిన మొత్తం చెల్లించాలి. దానికి ప్రతిగా ఆ పత్రిక ఆ అభ్యర్థి ప్రచారాన్ని ప్రకటనలలో కాకుండా వార్తల రూపంలో ప్రచురిస్తుంది. దానితో పాటుగా ఆ అభ్యర్థి కోరిన వార్తను, కోరిన పేజీలో, కోరిన ఫోటోతో సహా ప్రచురిస్తుంది. అమే కాదు - ఆ అభ్యర్థి ప్రత్యర్థులను కించ పరుస్తూ వార్తలు వ్రాస్తుంది. దానికి వారు పెట్టిన పేరు - ప్యాకేజి వార్తలు. క్రింద ప్రచురించిన బొమ్మలు ఇందులో భాగమే. ఫలానా అభ్యర్థికి ఫలానా నియోజక వర్గంలో బ్రహ్మరథం అని, ఆయన ప్రజా బంధు అని, పేద ప్రజల పాలిట పెన్నిధి అని, ఆయన చేసిన, చేయబోతున్న ప్రజాసేవ అంతా ఇంతా కాదని ఊదర పెట్టడం ఈ ప్యాకేజి పరమార్థం. చదివే పాఠకులకు అవి వార్తలుగా కనపడతాయి తప్ప - ప్రకటన అనే సూచన కూడా వుండదు. మరొక ప్రక్క - తమ ప్యాకేజి ఆఫర్‌ను అంగీకరించి, డబ్బు కట్టని అభ్యర్థులను రాచి రంపాన పెట్టడం కూడా ఈ వ్యాపార వ్యూహంలో ఒక భాగం. దానికి ఒప్పుకోని అభ్యర్థులు పరమ చెడ్డవారని, వారికి ఓటు వేస్తే దేశం నాశనమై పోతుందని, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని వార్తలు ప్రచురిస్తారు. వారు జరిపే సభలు కాని, సమావేశాలు కాని, ఇచ్చే ప్రకటనలు కాని పత్రికలో ప్రచురించరు. వారికి వ్యతిరేకంగా ఎవరు వార్త ఇచ్చినా పెద్ద శీర్షికతో మొదటి పేజీలో వచ్చేస్తుంది.

ఈ పేజీలోని రెండు బొమ్మలే దీనికి సాదృశ్యం. వెంకటగిరిలో ఇద్దరు అభ్యర్థులూ ప్యాకేజికి సమ్మతించలేదు; దానితో వీరిద్దరికీ ఓటు వేయడం దండగ అని [illegible] ప్రచురించారు. ఇద్దరికీ కాక ఇంకెవరికి ఓటు వేయాలో మరి. బొల్లినేని కృష్ణయ్య గారు ప్యాకేజి ప్రకారం సొమ్ము చెల్లించారు. దానితో ఆయనకు ఆ పత్రికే ప్రజా బంధు అని బిరుదు ఇచ్చింది.

ఒక్క "వార్త"కే కాదు ఈ జబ్బు అంటి వుండేది; ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు కూడా ఇదే మూసలో నడుస్తున్నాయి.

ఒక్కొక్క అభ్యర్థి దగ్గర ప్యాకేజి పేరుతో రెండున్నర నుంచి ఐదు లక్షల వరకు దండాయి ఈ పత్రికలు. ఆ లెక్కన దాదాపు కోటి రూపాయలు ఆర్జించాయి. ఆ డబ్బు కోసం వార్తలనే అమ్మకానికి పెట్టారు వారు.

కాని దీని వల్ల పత్రిక చదివే పాఠకులకు ఎంత అన్యాయం జరుగుతున్నదో ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదు. చిన్న చిన్న పత్రికలు ఎవరో ఒక అధికారినో, దిగువ స్థాయి రాజకీయ వాదినో వత్తిడి చేసి, బెదరింపు వార్తలు ప్రచురించి నాలుగైదు వందలు దండుకుంటే - ఎల్లో జర్నలిజం అని వెర్రి కేకలు పెడుతున్నారు పత్రికా సంపాదకులు. ఇప్పుడు తాము చేస్తున్నది ఎల్లో జర్నలిజం ఎట్లా కాకుండా పోతుందో సమాధానం చెప్పగలడా ఒక్క సంపాదకుడైనా?

దిన పత్రికలు ఇంత నీచానికి దిగజారడం పత్రికా రంగ ఆరోగ్యానికి కాక, ప్రజాస్వామ్యానికి కూడా తీరని ప్రమాదం. ప్రజాస్వామ్య విలువల గురించి పెద్ద పెద్ద సంపాదకీయాలు వ్రాసే సంపాదకులు ఈ పెడ ధోరణి పాటించడం హీనాతి హీనమైన నేరం. వ్యభిచారం కంటే జుగుప్స కల్గించే పాపం. జర్నలిస్ట్ సంఘాలు, మేధావి వర్గాలు ఈ పత్రికా రంగ పతనంపై ఉధృతమైన అలజడి జరపవల్సిన అవసరం చాలా వుంది. లేకుంటే ప్రజాస్వామ్యం నవ్వుల పాలై పోతుంది.

## ఆడవాళ్ల అండ

12వ పేజీ కొరవ

ముఖాలు చూపిస్తున్నారు. ఆయనకు అలవాటు లేని పని ఇది.

మాగుంట పార్వతమ్మ గారు తన మనమడిని ప్రజల ముందుకు తెచ్చారు. ఆ పసి పిల్లవాడిది ఓటు అడిగే వయస్సు కాదు; అవ్వా, మనుమళ్లకు అదొక సరదా. వెంకటగిరిలో పెద్ద రాజాగారు కూడా ఈసారి సరదా కోసం తన మనుమడు సర్వజ్ఞ యాచేంద్రను ఎండలో తిప్పుతున్నాడు. వీలైతే ఆ పిల్లవాడికే టిక్కెట్ ఇప్పించాలనుకున్నాడాయన. కాని చంద్రబాబు పడనివ్వలేదు. సూళ్లూరుపేటలో పరసారత్నం సతీమణికి రాజకీయ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనడం అలవాటే. ఆత్మకూరులో కొమ్మి లక్ష్మయ్యనాయుడు గారి సతీమణి కూడా అదే ఆనవాయితీ పాటిస్తున్నారు.

రాజకీయంగా ఎంత ప్రమాదంలో పడ్డామని తెలిసినా తమ మహిళలను ప్రచారానికి తీసుక రానిది ఆనం కుటుంబం మాత్రమే. ఆనం వెంకటరెడ్డి వున్నప్పుడు అంతే; ఇప్పటి వివేకా, రామనారాయణ రెడ్డిల తరంలోనూ అంతే. ఆదాల ప్రభాకర రెడ్డి కూడా తమ మహిళలను ఇబ్బంది పెట్టడం లేదు. అయితే ఆయన తరపున సోదరులందరు మాత్రం ఎండల్లో మాడి పోతున్నారు.

## సైకిల్ గతి

మొదటి పేజీ కొరవ

ఇప్పుడు జరుగుతున్నది కూడా అదే. ఒటి పలుకు విన్పడకుండా, దానికి విస్తృత ప్రచారం జరిగి తెలుగుదేశం కార్యకర్తలు నీరస పడకుండా చూడడానికి చంద్రబాబు పడుతున్న తాపత్రయం, చేస్తున్న ప్రయత్నం అంతా ఇంతా కాదు. అందుకోసం ఒక్క వార్త దినపత్రిక తప్ప తతిమా ప్రచార సాధనాలన్నిటినీ తన వశం చేసుకున్నారు. ఈనాడు దిన పత్రిక, ఈటివిలు ఆయన కొమ్ము కాయడం తెలిసిన సంగతే. కాని కొత్తగా వచ్చిన టివి9 వంటి ఛానళ్లను కూడా తన అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టంగా కనపడి పోతున్నది. వారు ఇటీవల ప్రసారం చేసిన ఎన్నికల సర్వే అందుకు ఒక ఉదాహరణ. రాష్ట్రంలో తెలుగుదేశం పతనమై పోతుందన్న నిజం వారి సర్వేలో తేలింది. కాని దాన్ని యథాతథంగా ప్రసారం చేస్తే తమ పార్టీ విజయావకాశాలు మరింత క్షీణించి పోతాయన్న భయంతో ఆ టివి యాజమాన్యంపై విపరీతమైన వొత్తిడి తెచ్చి, దాన్ని వక్రింప చేశారని తెలుస్తున్నది. ఆ సర్వేలో - తెలంగాణాలో ప్రభుత్వ వ్యతిరేకత ఉధృతంగా వుందని; కాంగ్రెస్, టిఆర్ఎస్ కూటమికి 107సీట్లలో 65 వరకు వచ్చే అవకాశం ఉందని వెల్లడైంది.

రాష్ట్రంలో మొత్తం మీద గతంలో కంటె తెలుగు దేశం ఓట్లు కనీసం 7శాతం చేజారి పోయాయని ఈ సర్వేలో తేలినట్లు ప్రకటించారు. కాని కాంగ్రెస్ కంటె తెలుగు దేశానికి నాలుగైదు సీట్లు అధికంగా వస్తాయని ప్రకటించారు. అసంబద్ధమైన వాదన ఇది. తెలుగుదేశం ఓట్లలో 2శాతం మార్పు వుంటే కాంగ్రెస్‌కు వచ్చే సీట్ల సంఖ్య 180దాటి పోతుందని ఎన్నికల విశ్లేషకుల అభిప్రాయం. అటువంటిది 7శాతం వుంటె తెలుగుదేశం పరిస్థితి ఏమిటి? ఆ నిజం టివిలలో ప్రకటిస్తే చంద్రబాబు అల్లాడి పోతాడని, నిజాన్ని కప్పి పెట్టి ఇటువంటి వక్ర నివేదిక ఇచ్చింది ఆ టివి యాజమాన్యం.

అయితే టివిలు ఏమి చెప్పినా, పత్రికలు ఎట్లా వ్రాసినా - ప్రజాభిప్రాయంపై వాటి ప్రభావం ఏ మాత్రం వుండని దశకు చేరిపోయింది పరిస్థితి. సైకిల్ గతి తప్పి పోయినట్లే లెక్క. దాన్ని చూసి చంద్రబాబుకు మతి తప్పుతున్నది. చివరి నిముషంలోనైనా ఏదో ఒకటి చేసి సైకిల్‌ను మళ్లీ గాటిలో పెట్టాలన్నది ఆయన ప్రయత్నం. అందుకోసం ఏమి చేయడానికైనా ఆయన సిద్ధపడుతాడు. మొదటి దశ ఎన్నికలు జరిగే తెలంగాణా, ఉత్తరాంధ్ర జిల్లాలలో ఇప్పటికే డబ్బు మూటలు విస్తారంగా పంపిణీ జరుగుతున్నాయి. వాటిలో కొన్ని పోలీసులకు పట్టు బడ్డాయి కూడా. కాని దొరికినవి - సముద్రంలో కాకి రెట్టతో సమానం. కోట్లాది రూపాయలు వెదజల్లుతున్నారు. మరొక ప్రక్క అధికార యంత్రాంగాన్ని వినియోగించే కార్యక్రమం కూడా జరుగుతున్నది. నక్సలైట్ల ప్రభావం కల్గిన జిల్లాలలో పోలీసు కవాతుల ద్వారా ప్రజలను భయపెట్టి పోలింగ్‌కు రాకుండా చేయడం; వీలైన చోటల్లా రిగ్గింగ్ జరిపించడం ఈ కార్యక్రమాలలో ఒక భాగం. ఈ ఎన్నికలలో ఓటమి తనకు రాజకీయ సమాధి అవుతుందన్న ఆదుర్దాతో దేనికైనాతెగించేటట్లు కన్పడుతున్నాడాయన. ఆయన దూకుడును కాంగ్రెస్ ఎంత వరకు నిలువరించగలదో చూడాలి.

## వాజ్‌పాయి

మొదటి పేజీ కొరవ

కల ప్రచారం చేస్తున్నారు.

బిజెపిలో కూడా ఈ విషయంలో కొంత అస్పష్టత లేక పోలేదు. వాజ్‌పాయికి ఇప్పటికే వార్ధక్యం హెచ్చింది. నాలుగు అడుగులు కూడా నడవలేని స్థితిలో వున్నారాయన. నూరు కోట్ల మంది జనాభా కల్గిన ప్రజాస్వామిక దేశానికి నడిచే స్థితిలో లేని నేత ప్రభుత్వ సారథ్యం వహించడం అన్నది విచారకరమైన పరిణామం. అయితే వాజ్‌పాయి వ్యక్తిత్వం, నాయకత్వ పటిమ ఆ లోపాన్ని ఇంత వరకు కప్పిపెడుతూ వచ్చాయి. కాని రేపటి ఎన్నికల తర్వాత కూడా ఆయనే ప్రధానమంత్రిగా కొనసాగడం దేశానికి అంత గౌరవప్రదం కాదు. కాని ఆయన కాకుంటే ఎవరు అనే ప్రశ్నకు సమాధానం చెప్పే స్థితిలో బిజెపి కాని ఎన్‌డిఎ కాని లేవు. వాజ్‌పాయి ప్రక్కకు తప్పుకుంటే బిజెపిలో అధికార పోరాటం తప్పదు. ఎల్‌కె అద్వానిని వారసుడిగా బిజెపి అంగీకరించినప్పటికీ, ఎన్‌డిఎలోని కొన్ని భాగస్వామ్య పక్షాలు సమర్థించే స్థితి లేదు. అద్వానికి హిందుత్వ మచ్చ వుంది. గుజరాత్ నరేంద్ర మోడీ వంటి అరాచక శక్తులను ప్రోత్సహిస్తున్నాడన్న చెడ్డపేరు వుంది. అందువల్ల కొన్ని మిత్ర పార్టీలు ఆయన వారసత్వానికి అభ్యంతరం పెట్టి తీరుతాయి. ఆ పరిస్థితి బిజెపిలో వారసత్వ పోరుకు తెరతీసే ప్రమాదం వుంది. కాబట్టి వాజ్‌పాయికి ప్రత్యామ్నాయం ఎవరు అనే చర్చను లేవనెత్తడానికే ఇష్టపడటం లేదు బిజెపి నేతలు.

దేశం మొత్తం మీద పరిస్థితి చూస్తే ఈసారి ఎన్డీఏ అధికారంలోకి వచ్చే సూచన కన్పించడం లేదు. అందుకు ప్రధాన కారణం - దక్షిణాది ఓటర్లలో గోచరమవుతున్న మార్పు. గత ఎన్నికలలో నాలుగు దక్షిణాది రాష్ట్రాలలో బిజెపికి 18 స్థానాలు వచ్చాయి; వారి మిత్ర పక్షాలలో తెలుగు దేశానికి - 29; డిఎంకెకి -12; జనతా దళ్‌కు 3 స్థానాలు వచ్చాయి. అంటె మొత్తం మీద దక్షిణాదిలో ఎన్డీఏకు వచ్చిన సీట్ల సంఖ్య - 52. కానీ ఈసారి ఆంధ్ర, కర్ణాటకలలో ఎన్డీఏ కూటమికి ఎదురు గాలి వీస్తున్నది. ఒక అంచనా ప్రకారం ఆంధ్రలో గరిష్టంగా 5; కర్ణాటకలో హెచ్చులో హెచ్చుగా 7స్థానాలు వస్తాయని అంచనా. అంటె దాదాపు 40సీట్ల కొరత ఏర్పడుతున్నది.


ఆ లోటు పూరించుకోవడానికి ఉత్తరాదిలో వీలు కాదు. గత-ఎన్నికల లోనే వారికి అత్యధిక స్థానాలు వచ్చాయి. రాజస్థాన్‌లో 25కి 16; ఉత్తరప్రదేశ్‌లో 80కి 32; మధ్యప్రదేశ్‌లో 40కి 29; మహారాష్ట్రలో 48కి 26; బీహార్‌లో 54కి 42; గుజరాత్‌లో 26కి 20 స్థానాలు వచ్చాయి ఎన్డీఏ భాగస్వాములకు. ఇప్పుడు అంతకంటె తగ్గడం తప్ప పెరిగే సూచన లేనే లేదు.

ఈ పరిస్థితులలో దక్షిణాదిలో ఏర్పడే కొరత ఎన్డీఏ అధికార యోగాన్ని అంతరింపచేస్తున్నదని పరిశీలకుల అంచనా. అట్లని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. వాజ్‌పాయి గద్దె దిగక తప్పని పరిస్థితి ఏర్పడినా సోనియా గాంధీ గద్దె ఎక్కడం మాత్రం కష్టమని పరిశీలకుల నిశ్చితాభిప్రాయం. వామ పక్షాలు, డిఎంకె వంటి పార్టీలు కల్సి కాంగ్రెస్ సహాయంతో ములాయం సింగ్ వంటి వారినెవరినైనా ఎక్కించడానికి ప్రయత్నిస్తాయన్నది వూహ. అందు కోసమే రిలయన్స్, సహారా వంటి పారిశ్రామిక సంస్థలు ఇప్పటి నుంచే సిద్ధమౌతున్నాయని చెప్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆ సంకీర్ణంలో ఒక భాగంగా చేరడం లేక బయట నుంచి మద్దతు ఇవ్వడమో జరుగుతుంది. అంతే తప్ప బిజెపి మాత్రం అధికారంలోకి వచ్చే అవకాశం లేదు.

## తారుమారు

6వ పేజీ కొరవ

తప్ప మరెక్కడా పెద్దగా డబ్బు పెట్టే స్థితిలో లేరు కాంగ్రెస్ వాదులు. అయినా ఆ పోలింగ్ మొత్తం చూస్తే కాంగ్రెస్‌కు ఏడు స్థానాలలో ఆధిక్యతతో వుండడం; తెలుగుదేశం మూడు స్థానాలకు కుంచించుక పోవడం ఓటరులోని మార్పును సూచిస్తుంది. అప్పటికీ ఇప్పటికీ తెలుగు దేశం పార్టీ పట్ల, ప్రభుత్వం పట్ల ప్రజలలో మరింత అసంతృప్తి పెరిగిందే తప్ప సానుకూలత వ్యక్తం కావడం లేదు. ఆ చిన్న కామన్‌సెన్స్ పాయింట్‌తో ఆలోచిస్తే రేపటి పోలింగ్‌లో ఓటరు తీర్పు ఎట్లా వుంటుందో సులభంగా వూహించుకోవచ్చు. ఆ వూహ జోలికి మేము వెళ్లదల్చుకోలేదు. పాఠకులే తమ నిర్ణయానికి తాము రావడానికి వీలుగా, నియోజక వర్గాల వారీగా ఎమ్మెల్యేస్ స్థానాల పేర్లు; వివిధ పార్టీలకు వచ్చిన ఓట్ల వివరం ఇస్తున్నాము.




Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.